26-2Pg1exHMNWJQE.qxd:26-2Pg1exHMNWJQE.qxd 26/02/25 11:58 PM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

అనంతపురం fb.com/vaartha

Published from Anantapur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-2-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 25 పేజీలు: 08+4 వెల: 6.50


ఢిల్లీ అసెంబ్లీని కుదిపిన 'కాగ్' నివేదిక

మరో భాషా యుద్ధానికి సిద్ధం: తమిళ సిఎం


# కౌరవ సభను గౌరవ సభ చేశాం

## గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో సిఎం చంద్రబాబు

### మే నెల నుంచి తల్లికి వందనం

### రైతు భరోసా కింద రూ. 20వేలు ఇస్తాం

### వచ్చే విద్యా సంవత్సరం 16,384 టీచర్ పోస్టులు భర్తీ



మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు చిత్త శుద్ధితో పనిచేస్తామని సిఎం నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. ఏపీ అసెంబ్లీలో మంగళవారం మధ్యాహ్నం తరువాత గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ వైఎస్సార్సీ హయాంలో జరిగిన సభ కౌరవసభని చంద్రబాబు విమర్శించారు. కౌరవ సభను గౌరవసభ చేశాకే అసెంబ్లీలో అడుగు పెడతానని శపథం చేశామని గుర్తుచేశారు. గౌరవసభను అవమానించే పార్టీ ఇవాళ అసెంబ్లీలో లేకుండా పోయిందని చెప్పారు. శాసనసభలో నిన్న (సోమవారం) చీకటి రోజు అని తెలిపారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్సీ నేతలు కేవలం 11 నిమిషాలే అసెంబ్లీలో ఉన్నారని వివరించారు. సంప్రదాయాలు మరచి ప్రతిపక్ష హోదా ఇవ్వాలనడం సమంజసమా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది తాము కాదని ప్రజలని చంద్రబాబు వెల్లడించారు.
స్వార్థ ప్రయోజనాల కోసం తాము కలిసి పోటీ చేయలేదని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలనే లక్ష్యంకలిసి పోటీ చేసినట్లు చెప్పారు. వైఎస్సార్సీ పాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ నిర్వీర్యమైందని ఆరోపించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం లేకుంటే ఏపిని పునర్నిర్మాణం చేయలేమని భావించామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్న కేంద్రానికి ధన్యవాదాలు తెలియజేశారు. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఇప్పుడిప్పుడే బయటకు తెస్తున్నామని వ్యాఖ్యానించారు. >>2



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం పవన్, నాదెండ్ల తదితరులు

# అసెంబ్లీలో అలా ప్రవర్తించ వచ్చునా?

### వైఎస్సార్సీ సభ్యుల తీరుపై డి.సిఎం పవన్

### సభ్యులే రూల్స్‌ను అతిక్రమిస్తే ప్రజలకు ఏం చెబుతాం?

**విజయవాడ,ఫిబ్రవరి25,ప్రభాతవార్తప్రతినిధి:** అసెంబ్లీలో వైసీపీ సభ్యుల తీరు చూస్తే పాలసీ టెర్రరిజం గుర్తుకు వచ్చిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విమర్శించారు. వైఎస్సార్సీ పాలనలో ఎపి సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. అసెంబ్లీలో మంగళవారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే చర్చలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగానికి జనసేన పార్టీ తరపున, వ్యక్తిగతంగా తన తరపున ధన్యవాదాలు తెలిపారు. గతంతో >>2



## ఎపి ఫైబర్‌నెట్ కొత్త ఎండీగా ప్రవీణ్ ఆదిత్య

**విజయవాడ,ఫిబ్రవరి25,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ఫైబర్‌నెట్ నూతన ఎండీగా ప్రవీణ్ ఆదిత్య నియమితులయ్యారు. ఈమేరకు ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫైబర్‌నెట్ పరిధిలో అధికార యంత్రాంగం పనితీరుపై ఫైబర్ నెట్ మాజీ ఛైర్మన్ జీవీ రెడ్డి బాధ్యతల్లో ఉండగానే మీడియా సమావేశంలో పలు కీలకంశాలపై ప్రకటనచేసారు.
ముగ్గురు అధికారులను బదిలీ చేస్తున్నామని వెల్లడించారు. దాంతో ప్రభుత్వం ఆయన ప్రకటన విషయంలో విచారణకు ఆదేశించింది. అదే సందర్భంలో ఇటువంటి అంశాలు, ప్రకటనలు ప్రభుత్వం >>2

# 'కల్తీ' పాత్రధారులు ఏరీ?

### • ఎఆర్ డెయిరీ నిందితుని బెయిలు పిటిషన్ డిస్మిస్ • సూత్రధారుల్ని తేల్చేదెప్పుడు? • ఇంకా కొలిక్కిరాని 'కల్తీ నెయ్యి' విచారణ



**తిరుమల,ఫిబ్రవరి 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీలో కల్తీనెయ్యి సరఫరా చేసిన పాపంలో నలుగురు సూత్రధారులను అరెస్టుచేసిన సిబిఐ ,వారిని కస్టడీకి తీసుకుని మరిన్ని ఆధారాలు సేకరించింది. ఐదురోజుల కస్టడీలో కొంతవరకు నలుగురు నిందితులనుండి సమాచారం రాబట్టిన సిబిఐ సిట్ అధికారులు అవసరమైన మేరకు వారినుండి సమాధానాలు రాలేదనేది న్యాయస్థానానికి విన్నవించింది. ఈ నేపధ్యంలో ఈ కేసులో రెండో ప్రధాన నిందితుడుగా ఉన్న తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డైరీ యజమాని రాజశేఖరన్‌కు బెయిల్ ఇవ్వాలని ఆయన తరపున న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి డిస్మిస్ చేశారు. ఈ కేసులో ఇంకా కీలక వివరాలు రాబట్టాల్సి ఉందని, మరోసారి కస్టడీకి ఇవ్వాలని సిబిఐ అధికారులు న్యాయస్థానాన్ని కోరారు. అయితే దీనిపై తీర్పు వెలువడాల్సి ఉంది. అసలు సుత్రధారులను తేల్చే పనిలో సిట్ అధికారులు ఉన్నా వారెవరనేది ఉత్కంఠగానే మారింది.
తిరుమల లడ్డూ తయారీలో కీలకమైన ఆవునెయ్యి సరఫరాలో జంతువుల కొవ్వునూనె కలిపి, నాసిరకం నెయ్యి టిటిడికి అందించిన కేసులో ప్రధాన ముద్దాయిలు తమిళనాడు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరాదారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒ అపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలను సిబిఐ సిట్ అధికారులు తొలిసారిగా అరెస్టుచేశారు. వారిని తిరుపతి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించడం, ఆ తరువాత ఐదురోజుల కస్టడీకి తీసుకోవడం జరిగింది. తిరిగి వారిని కోర్టులో హాజరుపరచగా తిరుపతి జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. తిరుమలకు కల్తీనెయ్యి సరఫరా చేశారనే ఆరోపణలపై తిరుపతిలో 470/24 పోలీసు కేసు కూడా నమోదైంది.
గత మూడేళ్ళలో నెయ్యి సరఫరాలో నిబంధనలు ఉల్లంఘించారనేది సిబిఐ అధికారుల వివరణ, ఏఆర్ డైరీ పేరుతో టెండర్లు దక్కించుకున్న వైష్ణవీ డైరీ ప్రతినిధులు నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ వే బిల్లులతో కల్తీనెయ్యి సరఫరా చేయడం. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన పొరబాట్లుపై అపచారంపై ఇప్పుడు కీలక మలుపుతిరిగింది. సిబిఐ అధికారుల అదుపులో ఈ మూడు డైరీలకు సంబంధించి ప్రధానపాత్రదారులు 10మంది వరకు ఉన్నారనేది సమాచారం. వీరిని తిరుపతిలోని భూదేవికాంప్లెక్స్‌లోని కార్యాలయంలో మరింత లోతుగా విచారణ చేస్తున్న సిబిఐ సిట్ అధికారులు కీలక సమాచారం సేకరించారు. అయితే వీరి పాత్ర కేవలం ఉద్యోగులుగానే కావడంతో కేసు నమోదు చేసినా అరెస్టులు జరగలేదు.

**కల్తీనెయ్యి ఆధారాలతో నివేదికలు:**
తిరుమల వెంకన్న లడ్డూల తయారీకి గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వంలోని టిటిడి గత పాలకమండళ్ల ఛైర్మన్లు ఏకంగా నెయ్యి సరఫరాను ఇతర రాష్ట్రాలకు చెందిన డైరీలకు టెండర్లు కేటాయించడం, ఆ టెండర్లు మళ్లీ రెండవవ్యక్తి చేతులు మారడంతో కల్తీనెయ్యి సరఫరా జరిగింది. గత ఏడాది జూన్‌లో కల్తీనెయ్యి బాగోతం వెలుగుచూసింది. తిరుమలలో లడ్డూల తయారీకి రోజుకు 15వేల కిలోల ఆవు నెయ్యి వినియోగిస్తారు. గత ఐదేళ్లలో కల్తీనెయ్యి ఘటనపై తిరుపతి, తిరుమలలో టిటిడికి సంబంధించి నెయ్యి కొనుగోళ్లకు టెండర్లు పిలవడం, టెండర్లలో పాల్గొన్న పాలడైరీ >>2

## డేటా అనుసంధానంతో అద్భుత ఫలితాలు

### ఆర్టిజి కార్యదర్శి భాస్కర్ కాటంనేని

**విజయవాడ, ఫిబ్రవరి25, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వంలోని అన్ని శాఖలు, విభాగాలు తమ వద్ద ఉన్న డేటాకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని ఆర్టీజీఎస్‌కు అందజేయాలని రియల్ టైమ్ గవర్నెన్స్‌శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని అధికారులను ఆదేశించారు. డేటా అనుసంధానంతో డేటా లేక్ రూపకల్పనతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఆయన అన్నారు. కొన్ని శాఖల నుంచి అసమగ్ర డేటా, సమాచారం ఇస్తున్నారని అది సరికాదని సూచించారు. ఆర్టీజీఎస్ ఏర్పాటు చేస్తున్న డేటా లేక్, డేటా అనుసంధాన ప్రక్రియలో భాగంగా ఆయన మంగళవారం సచివాలయంలో వివిధ శాఖలు, విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రతి ప్రభుత్వశాఖలో, విభాగాల్లో ఒక చీఫ్ డేటా టెక్నికల్ ఆఫీసర్ని నియమించుకోవాలని గతంలోనే అన్ని శాఖలను ఆదేశించామన్నారు. అయితే ఇప్పటికి కేవలం 202 విభాగాల్లోనే ఈ అధికారులను నియమించుకున్నారని, ఇంకా 136 విభాగాల్లో సిడిటిఒ >>2

## జోగి రమేష్, అవినాశ్ దేశం విడిచి వెళ్లొద్దు

### సుప్రీం కోర్టు ఆదేశం

**విజయవాడ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రబాబు నివాసం, టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. వైఎస్సార్సీ నేతలు జోగి రమేశ్, దేవినేని అవినాష్ సహా 20 మంది దాఖలు చేసిన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ ముగించింది. దేవినేని అవినాష్ జోగి రమేశ్ సహా 20 మందికి సర్వోన్నత న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. నిందితులు మూడేళ్లుగా బెయిల్, ముందస్తుబెయిల్ కోరలేదు. ప్రభుత్వం మారిన తర్వాతే కోర్టు మెట్లు ఎక్కారు. నిందితులకు తాము తప్పు చేశామని >>2



రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ఆక్రమించిన ప్రభుత్వ భూములు

# రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డికి షాక్

### రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో 30 ఎకరాలు తొలగింపు

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** ఉమ్మడి కడప జిల్లా రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డికి కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఆయన ఆక్రమించిన ప్రభుత్వ భూములను తిరిగి కైవసం చేసుకుంది. రెవెన్యూ వెబ్ ల్యాండ్ నుంచి అక్రమంగా ఎంట్రీ చేసిన ఆయన కుటుంబ సభ్యుల పేర్లను తొలగించింది. 30 ఎకరాల విస్తీర్ణంలో ఆయన అక్రమంగా కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో అడంగల్, వన్ బి లో చేర్చారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి విచారణలో వెల్లడైంది. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ వెబ్ ల్యాండ్ నుంచివారి పేర్లను తొలగించడంతో ప్రభుత్వ భూమిగా కనిపిస్తోంది. రాజంపేట మండలం మందపల్లి గ్రామ పొలంలోని 814/3 లో నాలుగు ఎకరాలు ఎమ్మెల్యే భార్య జ్యోతమ్మ పేరుతో,814/4లో 5 ఎకరాలు ఎమ్మెల్యే మరదలు సుజన, 815/1లో 3.79 ఎకరాలు సుజన,815/2లో 5ఎకరాలు ఎమ్మెల్యే సోదరుడు అనిల్ కుమార్ రెడ్డి, 816/2లో >>2

# ఏనుగుల దాడి.. ముగ్గురు మృతి

### శేషాచలం అడవుల్లో గజరాజుల బీభత్సం

### మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం



ఏనుగుల దాడిలో మృతుల కుటుంబాలకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** దట్టమైన శేషాచలం అడవుల్లో వెళ్తున్న భక్తులపై గజరాజులు బీభత్సం సృష్టించాయి. తలకోన సిద్దేశ్వర స్వామి దర్శనానికి వెళుతున్న భక్తుల గుంపుపై ఏనుగులు దాడి చేయడంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. ఇద్దరు గాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు 10 లక్షల చొప్పున గాయపడ్డ వారికి ఐదు లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించింది. వివరాల్లోకి వెళితే... ఉమ్మడి కడప జిల్లా రైల్వే కోడూరు మండలం ఉర్లగడ్డ పోడుకు చెందిన 30 మంది తలకోన సిద్దేశ్వర స్వామి దర్శనం కోసం సోమవారం అర్ధరాత్రి బయలుదేరారు. తలకోనకు వెళ్లే దారిని ఫారెస్ట్ అధికారులు మూసివేశారు. దీంతో మరో రూట్లో వారు వెళుతుండగా ఏనుగుల గుంపు చూసిన బృందంలో ఒకరు పెద్ద ఎత్తున శబ్దం చేసినట్లు తెలుస్తోంది. ఏనుగుల గుంపులో ఓ చిన్న పిల్ల ఏనుగు కూడా ఉండడంతో గజరాజులు విరుచుకుపడ్డాయి.
సంఘటన స్థలంలోని ఉర్లగడ్డ పోడు అరుంధతి వాడకు చెందిన వంకాయల దినేష్, మణెమ్మ, కేబుడుగుంట పల్లెకు చెందిన తిరుపతి చంగల్ రాయుడును ఏనుగులు తొక్కి చంపాయి. ఏనుగుల దాడి నుంచి తప్పించుకొని తప్పించుకున్న అమ్ములు (12), రాజశేఖర్(35) అలియాస్ గనిలకు గాయాలయ్యాయి. రైల్వేకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి తరలించారు. మంగళవారం తెల్లవారుజామున ఓబులవారిపల్లి మండలంలోని గుండాల కోన సమీపంలో ఈ సంఘటన జరిగినట్లు బయటకు వచ్చింది. సంఘటనా స్థలానికి అన్నమయ్య జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్ సింగ్, ఫారెస్ట్ రేంజర్ శ్యాంసుందర్,రైల్వే కోడూరు సిఐ వెంకటేశ్వర్లు, రెస్క్యూటీమ్, 108 తరలి వెళ్లాయి. గాయపడ్డ వారిని దటమైన అడవుల నుంచి డోలీలో తీసుకువచ్చారు. >>2

## వల్లభనేని వంశీ రిమాండ్ పొడిగింపు

**విజయవాడ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ నేత మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ రిమాండ్‌ను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు పొడిగించింది. గతంలో విధించిన రిమాండ్ గడువు నేటితో ముగియనుండటంతో జైలునుంచే వంశీని వర్చువల్‌గా జడ్జి ఎదుట పోలీసుల హాజరుపరిచారు. అనంతరం న్యాయమూర్తి మార్చి 11 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నేటి నుంచి వంశీని మూడు రోజుల కస్టడీకి పోలీసులు తీసుకున్నారు. జైలువద్దకు పటమట పోలీసులు చేరుకుని వంశీని కస్టడీలోకి తీసుకుని భారీ బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో వైద్య పరీక్షలకు తరలించారు. ఆయన్ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న సమయంలో డ్రోన్ కెమెరాలతో పోలీసులు పర్యవేక్షించారు. సత్యవర్ధన్ స్టేట్‌మెంట్ ఆధారంగా వంశీని విచారించనున్నారు.

# ఐరాస ఓటింగ్‌లో రష్యాకు అమెరికా మద్దతు

### మారుతున్న ట్రంప్ విదేశాంగ విధానం, ఓటింగ్‌కు దూరంగా భారత్

**ఐక్యరాజ్యసమితి, ఫిబ్రవరి 25:** ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంప్రారంభం అయిన తర్వాత ఐక్యరాజ్యసమితిలో ప్రతి దశలో కూడా ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలిచింది. అందుకు తగినట్లుగానే ఓటింగ్‌లోకూడా పాల్గొని మరింత మద్దతిచ్చింది. అయితే డొనాల్డ్‌ట్రంప్ అ్యక్షుడుగా వచ్చినతర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ఆగ్రహంతో ఉన్నారు. మరోవైపు చిరకాలప్రత్యర్థిగా భావించే రష్యాతో సంబంధాలు పటిష్టంచేసుకునేందుకు ట్రంప్ సిద్ధం అయ్యారు. ఇటీవలి పలు సందర్భాల్లో పుతిన్‌తో ట్రంప్ స్వయంగా మాట్లాడినట్లు కూడా ప్రకటించారు. అలాగే ఇటీవలికాలంలో అమెరికా తన విదేశాంగవిధానం కూడా మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఐక్యరాజ్యసమితిలో ఉక్రెయిన్‌కి వ్యతిరేకంగాను, రష్యాకు మద్దతుగాను అమెరికా ఓటేసింది. రష్యా ఉక్రెయిన్‌నుంచి వైదొలగాలని, యుద్ధాన్ని కండించాలనే యుఎన్ తీర్మానానికి అమెరికా వ్యతిరేకంగా ఓటేయడం గమనార్హం. మరోవైపు అనేక యూరప్‌దేశాలు ఈ తీర్మానానికి మద్దతుప్రకటించాయి. భారత్ ఓటింగ్‌కి దూరంగా >>2

# భక్తులతో పోటెత్తిన 'కుంభ్'

## నేటితో ముగుస్తున్న మేళా



**మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 25:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకగా సాగిన మహాకుంభ్‌మేళా మహాశివరాత్రితో ముగుస్తోంది. చివరి రెండురోజులుకావడంతో భక్తులు ఒక్కసారిగాపోటెత్తారు. 144 ఏళ్లకు వచ్చిన ఈ పవిత్ర రాశుల సంగమంతో వచ్చిన మహాకుంభ్‌మేళాకు దేశవిదేశాల భక్తులు హాజరయ్యారు. గతనెల 13వ తేదీ పౌష్ పౌర్ణమి సందర్భంగా ప్రారంభం అయిన మహాకుంభ్ మేళాకు ఇప్పటివరకూ 63 కోట్లమందిభక్తులు వచ్చినట్లు ఉత్తరప్రదేశ్ సర్కారు అంచనావేసింది. గంగాయమున సరస్వతి పుణ్యనదుల పవిత్ర సంగమంలో స్నానమాచరించేందుకే భక్తులు ఎక్కువ మంది తరలివచ్చారు. సుదూర ప్రాంతాలనుంచి సైతం ప్రత్యేక వాహనాలతో తరలివచ్చారు. పవిత్ర సంగమంలో స్నానం చేసేందుకు వచ్చే భక్తులకోసం రైల్వేశాఖ కూడా ప్రత్యేకరైళ్లను నడిపింది. సుమారుగా 600కుపైగా ప్రత్యేకరైళ్లు దేశవ్యాప్తంగా ప్రయాగరాజ్‌కు నడిపించారు. వందలాదిగా టూరిస్టు బస్సులు వివిధ రాష్ట్రాలనుంచి ప్రయాగరాజ్‌కు వచ్చే >>2

26-02Pg3exHMNWJQETC.qxd:26-02Pg3exHMNWJQETC.qxd 26/02/25 11:56 PM Page 1





# మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు మంచిదికాదు

## - సిసిపుటేజీ విడుదలచేసిన అదనపు ఇఒ చౌదరి

**తిరుమల,ఫిబ్రవరి 25ప్రభాతవార్తప్రతినిధి:** భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం మంచిదికాదని, వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. కుమారుడిని కోల్పోయి తల్లిదండ్రులు బాధపడుతుంటే కొందరు పనిగట్టుకుని సామాజిక మాధ్యమాల్లో టిటిడిపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. గత శనివారం అన్నప్రసాదం భవనంలో క్యూలైన్లలో భక్తులు వచ్చే వీడియో సిసికెమెరా పుటేజీలను మంగళవారం సాయంత్రం తిరుమలలో మీడియాకు విడుదల చేసి చూపించారు. ఆ భవనంలో తొక్కిసలాటకు,తోపులాటకు ఆస్కారం లేదన్నారు. కర్నాటకకు చెందిన మంజునాథ్ ఏడేళ్ళప్పుడే గుండె చికిత్స చేయించుకున్నాడని ,భవనంలో ర్యాంప్‌పై పరిగెత్తుతూ ఒక్కసారిగా క్రిందపడిపోయాడని, తిరుమల అశ్వనీకి, తరువాత తిరుపతి స్విమ్స్‌కు తరలించి మెరుగైన వైద్యం చేయించామన్నారు. అయితే దురదృష్ట వశాత్తు ఇలా జరగడం ఆవేదన కలిగించిందన్నారు. తల్లిదండ్రులు జరిగిన వాస్తవాలు తెలుసుకుని పోస్టుమార్టమ్ కూడా వద్దని బాలుడి మృతదేహాన్ని తీసుకెళ్ళారని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో విఎస్ఒలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర ,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు.

# అధునాతన బోగీలతో ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 25,ప్రభాతవార్త** తెలుగు,కర్ణాటక రాష్ట్రాల ప్రయాణికుల సౌకర్యార్థం కాచిగూడ-యలహంక-కాచిగూడల మధ్య తిరిగే సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులకు జర్మనీదేశపు అత్యాధునిక యాంత్రిక, సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ బోగీలను రైల్వే బోర్డు కేటాయించింది. ప్రస్తుతం ఈ రైలు సర్వీసులు ఐసిఎఫ్ రేక్ ఫార్మేషన్‌తో తిరుగుతున్నాయి. కాచిగూడ నుంచి యలహంక వెళ్లే నెంబర్ 17603ఎక్స్‌ప్రెస్‌కు ఏప్రిల్ 24 గురువారం నుంచి,యలహంక నుంచి కాచిగూడ వెళ్లే నెంబర్ 17604 ఎక్స్‌ప్రెస్‌కు ఏప్రిల్ 25 శుక్రవారం నుంచి ఈ విధానం అమలులోకి తీసుకోరానున్నట్లు సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు. కాగా ఈ రైలు సర్వీసులకున్న డిమాండ్ మేరకు ఇప్పటికే చాలీచాలని బోగీలతో ఎలాగోలా నెట్టుకొస్తున్న ప్రయాణికులకు ప్రస్తుతం తిరిగే ఈ రైళ్లకు మొత్తం 23రైలు బోగీలుండగా, ఎల్‌హెచ్‌బీ బోగీల ప్రారంభం నుంచి ఒక బోగీని కుదించి 22బోగీలతో నడుపుతున్నట్లు అధికారులు తమ ఉత్తర్వులలో పేర్కొనడం గమనార్హం. ఈ విషయమై సంబంధిత అధికారులతో ప్రస్తావించగా,బోగీల సంఖ్య తగ్గినప్పటికీ, ఎల్‌హెచ్‌బీ బోగీలలో బెర్తులు,సిట్టింగ్ సామర్థ్యం ఎక్కువగా ఉంటుందన్నారు.

# ఏనుగుల దాడిలో భక్తుల మృతిపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**విజయవాడ,ఫిబ్రవరి25,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం గుండాలకోన ఆలయం వద్ద ఏనుగుల దాడిలో భక్తులు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదే దాడిలో మరికొందరు గాయపడిన ఘటనపై సిఎం విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సిఎం అధికారులకు సూచించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సిఎం ప్రకటించారు. మృతుల కుటుంబాలకి రూ.10 లక్షలు, క్షతగాత్రులకి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అన్నమయ్య జిల్లా గుండాల కోన అటవీ ప్రాంతంలో ఏనుగుల తొక్కిసలాటలో ముగ్గురు భక్తులు మృతి చెందిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు అటవీ శాఖ ఉన్నతాధికారులు, అన్నమయ్య జిల్లా అధికార యంత్రాంగం నుంచి ఘటన వివరాలు తెలుసుకున్నారు.క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మృతుల కుటుంబాలకి రూ.10 లక్షలు, క్షతగాత్రులకి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు.మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అటవీ ప్రాంతాల్లో ఉన్న అలయాలను దర్శించుకునే భక్తులకి తగిన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించి భరోసా ఇవ్వాలని ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కు దిశానిర్దేశం చేశారు.

# సభలో వైఎస్సార్సీ సభ్యుల తీరుపై స్పీకర్ అసహనం



**విజయవాడ,ఫిబ్రవరి25,ప్రభాతవార్తప్రతినిధి:**శాసన సభలో నిన్న వైఎస్సార్సీపీ సభ్యుల ప్రవర్తనపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంగళవారం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభలో నిన్నటి పరిణామాలు బాధ కలిగించాయని అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సభ ప్రారంభం కాగానే ఆయన మాట్లాడారు. గవర్నర్ ని అతిథిగా ఆహ్వానించి ఆయనతో ప్రసంగం ఇప్పిస్తే సభ్య సమాజం అసహ్యించుకునేలా వైఎస్సార్సీపీ వ్యవహరించిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి సభ్యత మరిచి ప్రవర్తించాడని స్పీకర్ మండిపడ్డారు. తన పార్టీ నేతలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, ప్రసంగం పుస్తకాలు చించుతుంటే వారిని జగన్ నియంత్రించాల్సింది పోయి కూర్చుని నవ్వుకుంటాడా అని స్పీకర్ ప్రశ్నించారు. బొత్స లాంటి సీనియర్ నేత పక్కనే ఉండి కూడా జగన్ చేసేది తప్పని చెప్పకపోవటం సరికాదని హితవు పలికారు. రానున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు జరగడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. ఇకపై అయినా విజ్ఞతతో వ్యవహరించాలని అన్నారు. రాజ్యాంగం ద్వారా కాకుండా సర్వ హక్కులు తనకే ఉన్నాయి అన్నట్లు ప్రవర్తించటం ఎవరికీ తగదని అన్నారు. నిన్నటి వైఎస్సార్సీపీ తీరును ప్రతీ ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని స్పీకర్ అయ్యన్న తెలిపారు. ఇక ఈ రోజు ఒక మీడియాకు ప్రివిలేజ్ నోటీసులు ఇవ్వాలని శాసనసభ నిర్ణయించింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభా హక్కుల కమిటీకి ఆ మీడియా కథనాలను రిఫర్ చేశారు. ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు జరగకుండా కోట్లాది రూపాయలు వెచ్చించారంటూ ఆ పత్రిక కథనాలను సభ దృష్టికి నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య తెచ్చారు.ఆ పత్రిక, మీడియాపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభాపతి నిధుల దుర్వినియోగం చేసారంటూ వచ్చిన కథనాలపై కఠిన చర్యలు ఉండాలని కోరారు. శిక్షణ తరగతులు లేకుండా కోట్లాది రూపాయలు దుర్వినియోగం అంటూ వచ్చిన కథనాలు నన్ను బాధించాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఇలాంటి అసత్య కథనాలు ఉపేక్షించరాదని తేల్చిచెప్పారు. సభ్యుల కోరిక మేరకు అసత్య కథనాలపై చర్యలకు సభా హక్కుల కమిటీకి సిఫార్సు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. సభా హక్కుల కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడించారు.

# సిఎస్‌లతో కేబినెట్ కార్యదర్శి డాక్టర్ టి.వి.సోమనాథన్ వీడియో సమావేశం

**సచివాలయం,ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** సులభతర వాణిజ్య విధానం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)పై మంగళవారం ఢిల్లీ నుండి కేబినెట్ కార్యదర్శి డాక్టర్ టివి సోమనాథన్ సిఎస్‌లతో వీడియో సమావేశం నిర్వహించారు. గత ఏడాది డిసెంబర్ 13-15తేదీల్లో ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన ప్రధాన కార్యదర్శుల జాతీయసమావేశంలో సులభతర వాణిజ్య విధానానికి సంబంధించి నిబంధనలు మరియు విధానాలను సంస్కరించడంలో, సరళీకరించడంలో రాష్ట్రాలకు సహాయం చేయడానికి కేబినెట్ సెక్రటేరియట్‌లో కార్యదర్శి స్థాయి కోఆర్డినేటింగ్ అధికారి నేతృత్వంలో డీరెగ్యులేషన్ సెల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.అంతేగాక కంప్లయన్స్ తగ్గింపు మరియు డిరెగ్యులేషన్‌పై టాస్క్‌ఫోర్స్‌గా వ్యవహరించడానికి క్యాబినెట్ సెక్రటరీ అధ్యక్షతన కార్యదర్శుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ ప్రక్రియలో భాగంగా కేబినెట్ కార్యదర్శి సోమనాథన్ సిఎస్‌లతో వీడియో సమావేశం ద్వారా మాట్లాడుతూ కంప్లయెన్స్ భారాన్ని తగ్గించేందుకు డీరెగ్యులేషన్ సెల్‌కు తగిన తోడ్పాటును అందించేందుకు పలువురు కార్యదర్శులతో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటిని కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు.ఈ కమిటీలో సభ్యులైన కార్యదర్శులు మార్చి నుండి రాష్ట్రాల్లో పర్యటిస్తారని వారు పర్యటనకు వచ్చినప్పుడు ప్రభుత్వ కార్యదర్శి స్థాయిలో ఒక ఇంటర్డైరెక్టరీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిఎస్‌లకు సూచించారు. సులభతర వాణిజ్యానికి సంబంధించి వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను (బెస్ట్ ప్రాక్టిసెస్) కేంద్రం స్వాగతిస్తుందని కేబినెట్ కార్యదర్శి సోమనాథన్ తెలిపారు.ఈ వీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ సులభతర వాణిజ్య విధానంలో భాగంగా కంప్లెయన్స్ బర్డెన్ తగ్గించడం (ఆర్‌సిబి) లేదా రెగ్యులేటరీ కంప్లెయన్స్ బర్డెన్‌ను తగ్గించడం (ఎమ్మార్‌సిబి) కార్యక్రమం అమల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.ఇప్పటివరకు 60కిపైగా నిబంధనల్లో 632సమ్మతిని తగ్గించిందని వివరించారు.ఏడాది కాలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకంప్లెయన్స్ బర్డెన్ తగ్గించే కార్యక్రమం కింది తిరిగి ఊపందుకోవడానికి కృషి జరుగుతోందని చెప్పారు.రాష్ట్రంలో ఈ కార్యక్రమం అమలును పర్యవేక్షించడానికి సిఎస్ నేతృత్వంలో ఒక సాధికార కమిటీ ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.వివిధ విభాగాలు సమర్పించిన సమ్మతి తగ్గింపు ప్రతిపాదనలను కూడా ఈసాధికార కమిటీ సమీక్షించడంతో పాటు అందుకు తగినట్లుగా తగిన ఆదేశాల ను జారీ చేస్తుందని చెప్పారు.దేశంలో అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడులకు గమ్యస్థానంగా మారాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కార్యక్రమానికి ప్రాధాన్యతను ఇస్తుందని సిఎసి విజయానంద్ కేబినెట్ కార్యదర్శికి వివరించారు.2025ప్రారంభం నుండి ఇప్పటిరకు 7విభాగాల్లో 60కి పైగా భారమైన సమ్మతిని తగ్గించడం జరిగిందన్నారు.



కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి వీడియో సమీక్షలో పాల్గొన్న ఏపి ప్రధాన కార్యదర్శి వివిధ శాఖల అధికారులు

# అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సత్యదూరం

## :మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

**విజయవాడ,ఫిబ్రవరి25,ప్రభాతవార్తప్రతినిధి:** అసెంబ్లీ సమావేశాల్లో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం సత్యదూరంగా ఉందని మాజీ మంత్రి, వైసీపీ అగ్రనేత బొత్స సత్యనారాయణ అన్నారు. గవర్నర్ ప్రసంగంలో క్లారిటీ లేదన్నారు. . గత ప్రభుత్వం చేసిన విధ్వంసం అంటూ గవర్నర్ ప్రసంగించడం కరెక్ట్ కాదని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 21 యూనివర్సిటీ వీసీలలో 19 మందిని రాజీనామా చేయించారని అన్నారు. కూటమి ప్రభుత్వం బలవంతంగా వీసీలను రాజీనామా చేయించిందని మండిపడ్డారు. వీసీల రాజీనామాపై విచారణ జరిపించాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బొత్స సత్యనారాయణ మాట్లాడారు. సందర్భం కాని అంశాలను మంత్రి నారా లోకేష్ సభలో మాట్లాడుతున్నారని చెప్పారు. వైసీపీ నేతలను బెదిరించే విధంగా లోకేష్ మాట్లాడుతున్నారని బొత్స సత్యనారాయణ ఫైర్ అయ్యారు. ఆ బెదిరింపులకు భయపడేది లేదు.. అవసరమైతే విచారణ చేసుకోవాలని బొత్స సత్యనారాయణ సవాల్ విసిరారు.

గ్రూప్ 2 పరీక్షల్లో కూటమి ప్రభుత్వం అభ్యర్థులను మభ్యపెట్టిందని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రాజకీయ అవగాహన లేదని.. ఆవేశంతో మాట్లాడి ఉంటారని బొత్స సత్యనారాయణ అన్నారు. పవన్ కల్యాణ్ అపోజిషన్‌లో ఉంటానంటే తమకు అభ్యంతరం లేదని చెప్పారు. తాము పదవులను కాపాడు కోవటానికి అసెంబ్లీకి హాజరు కాలేదని స్పష్టం చేశారు. ఎటువంటి పరిస్థితితులు ఎదుర్కోటానికి అయినా తాము సిద్ధంగా ఉన్నామని బొత్స సత్యనారాయణ తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల్లో తిరిగే పలు రైళ్లు మార్చి 8 వరకు రద్దు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 25,ప్రభాతవార్త** మహాకుంభమేళా-2025కు తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి రద్దు చేసిన పలు పాసింజర్ రైలు సర్వీసుల రద్దును మార్చి 8వరకు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. రైల్వే బోర్డు ఆదేశాల మేరకు నార్త్ సెంట్రల్ రైల్వే జోన్‌కు తెలుగు రాష్ట్రాల్లో తిరిగే అనేక రైలు సర్వీసులను రద్దు చేసి వాటిని అక్కడికి పంపింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ (అలహాబాద్)లో ఈ ఏడాది జనవరి 13నుంచి ఫిబ్రవరి 26వరకు జరిగే మహాకుంభమేళా-2025కై గత ఏడాది డిసెంబర్ 28నుంచి రెండు మాసాల పాటు రద్దు చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. తిరిపతి-కదిరిదేవరపల్లి-తిరుపతిల మధ్య తిరిగే నెంబర్ 57405/06 పాసింజర్, తిరుపతి-గుంతకల్లు-తిరుపతి నెంబర్ 57404/03 పాసింజర్, తిరుపతి-హుబ్లీ- తిరుపతి నెంబర్ 57401/02 ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను మార్చి 07/08 తేదీల వరకు రద్దు చేశారు. అలాగే రాజమండ్రి-విశాఖపట్నం-రాజమండ్రి, విశాఖపట్నం-విజయనగరం-విశాఖపట్నం,విశాఖపట్నం-పలస-విశాఖపట్నం, తిరుపతి-కాట్పాడి- తిరుపతి, కాచిగూడ- మహబూబ్ నగర్- కాచిగూడ, కాచిగూడ- మిర్యాలగూడ-కాచిగూడ,కాచిగూడ-నడికూడి-కాచిగూడ మధ్య తిరిగే రైలు సర్వీసులను కూడా మార్చి 07/08వరకు రద్దు చేసినట్లు పేర్కొంది.

## ప్రయాగ్ రాజ్‌లో రెండో రోజు మంత్రి నారాయణ బృందం పర్యటన

**విజయవాడ.ఫిబ్రవరి25,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రయాగ్ రాజ్ లో మంగళవారం రెండో రోజు మంత్రి నారాయణ బృందం పర్యటన గోదావరి పుష్కరాల కోసం కుంభమేళా ఏర్పాట్లు అధ్యయనం చేస్తున్న మంత్రి బృందంమహా కుంభమేళా కు చేసిన ఏర్పాట్లు అధ్యయనం ద్వారా 2027 గోదావరి పుష్కరాలకు సన్నద్ధం కానున్న ప్రభుత్వంనిన్న కుంభమేళా ఏర్పాట్లపై మంత్రి బృందానికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చిన అక్కడి అధికారులుభక్తుల రద్దీ,ట్రాఫిక్ నియంత్రణ,రవాణా సౌకర్యాలు,పారిశుధ్యం,స్నాన ఘాట్ల వద్ద ఏర్పాట్లు,ఘాట్ల అభివృద్ధి,భద్రత చర్యలపై అధ్యయనం చేస్తున్న మంత్రి బృందంకుంభ మేళా జరుగుతున్న పలు సెక్టార్ లలో ఏర్పాట్లను పరిశీలించనున్న మంత్రి నారాయణ,అధికారులుమధ్యాహ్నం కుంభమేళా అథారిటీ ఆఫీసులో అధికారులతో మంత్రిమంత్రి నారాయణ సమావేశం అయ్యారు.ఆయనతో పాటుమున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్,రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ సమావేశంలో పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## అశ్వవాహనంపై ఆదిదేవుడు



**తిరుమల,ఫిబ్రవరి 25ప్రభాత వార్తప్రతి నిధి:** తిరుమల తిరుపతిదేవస్థానం ఆద్వర్యంలోనితిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి ఆదిదేవుడు భూతనాధుడు సోమస్కంధమూర్తి అశ్వవాహనంపై భక్తులకు అభయమిచ్చాడు. అశ్వం పరాక్రమానికి,వేగానికి నిదర్శనం. తనను నమ్మికొలిచిన భక్తులను కాపాడటానికి శివుడు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడని తెలియజేసేందుకే అశ్వవాహనంపై ఆధిరోహించి కటాక్షించాడు. మంగళవారం రాత్రి ఆలయ పురవీధుల్లో భక్తుల భజనలు, కోలాటలు ముందు వాహనసేవ జరిగింది. అలాగే బ్రహ్మోత్సవాల్లో ఉదయం కపిలేశ్వరుడు కామాక్షి అమ్మవారితో కలసి కల్పవృక్షవాహనంపై ఊరేగారు. ఉదయం నిత్యకైంకార్యలు పూర్తిచేసుకున్న తరూవాత స్వామివారు ఆలయ పురవీధుల్లో ఊరేగడంతో భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కల్పవృక్షం కోరిన కోరికలు నెరవేర్చే వృక్షం. భక్తులు తనను సేవించిన వారి కష్టాలు తొలగిపోతాయనేది ఈశ్వరుడు తెలిపిన విషయం. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## మొగలిచెర్ల దత్తాత్రేయ మందిరంలో నేడు మహాశివరాత్రి వేడుకలు

**తిరుపతి,ఫిబ్రవరి 25ప్రభాతవార్తప్రతినిధి:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నెల్లూరుజిల్లా లింగసముద్రం మండలం మొగల చెర్ల దత్తాత్రేయస్వామి మందిరంలో బుధవారం వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఆలయంలో ఉదయం నుండి రాత్రి వరకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవనినాగేంద్రప్రసాద్ తెలిపారు. దత్తక్షేత్రంలోని శివాలయంలో తెల్లవారుజాము నుండి అభిషేకాలు జరుగుతాయి. రాత్రికి కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు మందిరంలో ఉంటాయి.

ఆలయానికి విచ్చేసే భక్తులకు మధ్యాహ్నం, రాత్రికి అందరికీ ఉచిత అన్నప్రసాద వితరణ ఉంటుందని ధర్మకర్త తెలిపారు.

ఈ మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## బంగారు భక్తుడు! 8కిలోల ఆభరణాలు ధరించి దేవుని దర్శనం



**తిరుమల,ఫిబ్రవరి 25ప్రభాతవార్తప్రతినిధి:** అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలంటూ..తన తల్లికోరిక మేరకు ఇలా బంగారు ఆభరణాలు ధరించడం అలవాటుచేసుకున్నట్లు ఓ భక్తుడు తెలిపాడు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన బంగారుదేవుడుగా ఖ్యాతిచెందిన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఒంటినిండా బంగారుఆభరణాలు ధరించి భక్తుడు దర్శనం చేసుకున్నాడు. తమిళనాడుకు చెందిన ఈ భక్తుడు మంగళవారం ఉదయం తిరుమలకు విచ్చేశారు. ఆయన ఒంటిపై 8కిలోల బంగారు ఆభరణాలను ధరించి బంగారుదేవుడిని దర్శనం చేసుకోవడం ప్రత్యేకత. ఒంటిపై అంత బంగారు ధరించి వచ్చిన భక్తుడిని తిరుమలలో ఇతర భక్తులు ఆశ్చర్యంగా తిలకించారు.

## అన్ని సమస్యలు తొలగిపోవాలి :నటుడు మంచు విష్ణు



**తిరుమల,ఫిబ్రవరి 25ప్రభాత వార్తప్రతి నిధి:** అన్ని సమస్యలు తోలగిపోయి అంతా సవ్యంగా ఉండాలని వేడుకున్నట్లు సినీనటుడు మంచు విష్ణు, శివబాలాజీ తెలిపారు. కలి యుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని వేడుకున్నానన్నారు. మంగళ వారం ఉదయం విఐపి బ్రేక్‌లో తిరుమలేశుని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# సచివాలయాల్లో మిగులు ఉద్యోగులు 15,498

**విజయవాడ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ సచివాలయాల ఉద్యోగులు ఏ ఒక్కర్నీ తొలగించమని సచివాలయాల శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి ఇటీవల వారి ఆ ఉద్యోగుల సంఘం నాయకులతో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంళంలో ఈ గ్రామ వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో 15498 మంది మిగులుగా ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. గ్రామ సచివాలయాల్లో 12126 వార్డు సచివాలయాల్లో 3372 మందిగా గుర్తించారు. వారి ఆసక్తి మేరకు సచివాలయాల్లోనే యాస్పిరేషనల్ ఫంక్షనరీలుగా తీసుకుంటారు. అప్పటికీ మిగిలిన వారిని డిప్యుటేషన్‌పై ఇతర ప్రభుత్వ శాఖలకు పంపాలని యోచిస్తున్నారు. హేతుబద్ధీకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఉద్యోగులు ఏ ఒక్కర్నీ తొలగించమని సచివాలయాల శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి ఇప్పటికే స్పష్టం చేశారు. ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు ఆయా ప్రాంత జనాభా ఆధారంగా సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో 6 నుంచి 8 మధ్య ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సచివాలయాల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వివిధ ప్రభుత్వ శాఖల సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. సచివాలయాల హేతుబద్ధీకరణమై మంత్రి బాల వీరాంజనేయస్వామి ఇటీవల ఉద్యోగ సంఘ ప్రతినిధులతో సమావేశమైనప్పుడు వారంతా అనేక సమస్యలను ప్రస్తావించారు. మిగులు ఉద్యోగులు ఇతర ప్రభుత్వశాఖల్లో పని చేసేందుకు సముఖత వ్యక్తం చేస్తూనే కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు.

# శ్రీకాళహస్తిలో మహా శివరాత్రి వైభవం

## తిరు ఆభరణాలతో కొలువుదీరుతున్న వాయులింగేశ్వరుడు

**(శ్రీకాళహస్తి ప్రభాతవార్త)** భారతదేశంలోని శైవారామాలు భక్తితో శివ..శివా అంటూ ముక్తిని, మోక్షాన్ని, కైవల్యాన్ని కోరుకొనే శివరాత్రి. దక్షిణభారతదేశంలోని పంచ భూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయం భువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. కైలాసనాథుడు విభూధీశుడు అంటారు. అయితే శ్రీకాళహస్తిలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుడు కోటీశ్వరుడు. ఆది దేవుని రాజసాన్ని నంది వాహనంపై తిలకించి భక్త కోటి పులకించిపోయే పర్వదినం. నాగాలను తలపాగాలుగా చుట్టి శరీరం నుండి నాగాలను ఆభరణాలుగా అలంకరించుకొని కైలాసనాథుడు శ్రీకాళహస్తీశ్వరాలయంలో కన్ను జిగేలు మనే తిరుఆభరణాల్ని ధరించి భక్తులకు దర్శనమిచ్చే పర్వదినం. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు ఆలయంలో మహాశివరాత్రి జన జాగరణకు సర్వం సిద్ధం చేశారు. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగావెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయంలో



కన్నప్ప కొండపై స్వామి అమ్మవార్ల దర్శనం

ఈ ఏడాది గతం కన్నా భిన్నంగా శివరాత్రి నిర్వహణకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారు. ముఖ్యంగా ఆలయంలో శాశ్వత లైటింగ్‌ను రూ.కోటితో ఏర్పాటు చేసారు.అలాగే పూల సొగసులనుఈ ఏడాది హైదరాబాదు నిర్వాహకులకు అప్పగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది లైజర్ లైటింగ్‌ను ప్రవేశ పెట్టారు. సామాన్య భక్తులకు ఉచిత దర్శనానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారు. భక్తజనవల్లభుడు శివుడు నంది వాహనంపై దేవేరి జ్ఞానప్రసూనాంబ దేవి సింహవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చే పర్వదినం కోసం ఎదురు చూశారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినం శివయ్య దర్శనానికి విచ్చేసే భక్తులకు శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయాధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు. గతం కన్నా ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరగవచుననే అంచనాలతో అధికారులు ఏర్పాట్లు చేశారు. సామాన్య భక్తులకు సైతం సుదర్శన భాగ్యం కల్పించేందుకు మహాలఘుదర్శనాన్ని ఖరారు చేశారు. సాధారణంగా ఈ ఆలయంలో విఐపిలకు అర్థమండప దర్శనం అనుమతించేవారు.కానీ రద్దీ దృష్ట్యాఆ దర్శనాలు కూడా రద్దు చేశారు. చక్కటి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులు క్యూలైన్ల ద్వారా స్వామి అమ్మవార్లను దర్శించుకొనేందుకు వీలు కల్పించారు. ఎక్కడా అడ్డదారి దర్శనాలు లేకుండా క్యూ లైనను ఇంజనీరింగ్ అధికారులు రూపకల్పన చేశారు. వేకువ జామున నుంచే భక్తులకు దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. దూర ప్రాంతాల నుండి స్థానికంగా వున్న భక్తులు వచ్చినప్పుడు ఒక్కసారిగా లోపలికి అనుమతించకుండా అక్కడక్కడా కంపార్ట్‌మెంట్ల లాగా ఏర్పాటు చేసుకొని తొక్కిసలాట, తోపులాట లేకుండా అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. సాధారణ క్యూలైన్లతో పాటు విఐపి భక్తులకు మరో క్యూలైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రోటోకాల్ ప్రకారం విఐపిల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది విఐపిల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్‌ను అలాగే అర్చకులు సిబ్బంది వాహనాలకు మరో చోట పార్కింగ్ సదుపాయం కల్పించారు. సన్నిధివీధి, దిగువ సన్నిధివీధుల్లో అవకాశం కల్పించారు. సుమారు రెండులక్షల మంది భక్తులు హాజరుకావచ్చునని అంచనాలతో అన్నపూర్ణా నిలయంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. అలాగే భక్తులందరికీ ప్రసాదాలను అందుబాటులో వుంచారు.స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరునికి మహాశివరాత్రిని పురస్కరిం చుకొని ఏకాదశ రుద్రాభిషేకాలు చేయడం ఇక్కడి ఆలయ సంప్రదాయం. మహాశివరాత్రి పర్వదినాన ఉదయం నుండి రాత్రి వరకు పదికాలాల్లో అభిషేకాలను నిర్వహిస్తారు. 11వ కాలాన్ని లింగోద్భవ అభిషేకంగాను, దీన్నే బ్రహ్మా అభిషేకమని కూడా పిలుస్తారు.

వార్త

నీ ప్రయత్నం లేకుండా నిన్ను ఎవరైనా మరీపైకి తీసుకెళ్లలేరు. అలాచేస్తే నీవక్కడ ఉండలేవు. నీవు సొంతంగా ప్రయత్నిస్తే పర్వతాలే అధిరోహించగలవు.


-రోజర్

# జనారణ్యంలోకి వన్యప్రాణులు!

అటవీ రక్షణకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా, అడవులను ధ్వంసం చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని అటు కేంద్రపాలకులు, ఇటు రాష్ట్రాల పాలకులు ఎన్ని హెచ్చరికలు చేసినా, ఆశించిన ఫలితాలు లభించడం లేదు. అంతకంతకు అటవీ విధ్వంసం పెరిగిపోతున్నది. కొందరు అధికారుల అవినీతి, నిర్లక్ష్యం, అన్నింటి కంటే ముఖ్యంగా రాజకీయ జోక్యంతో చట్టాలు నిరుపయోగం అవుతున్నాయి. అరణ్యాలను స్మగ్లర్లకు, వేటగాళ్లకు వదిలి కొందరు అధికారులు జనారణ్యానికే పరిమితం కావడంతో పరిస్థితి అంతకంతకు దిగజారిపోతున్నది. ఒకనాడు కాకులు దూరని కీకారణ్యాలుగా పేరుపొందిన నలమల, దండకారుణ్యాలు సైతం మైదానాలుగా మారిపోతున్నాయి. ఈ అటవీ సంపదతోపాటు వీటినే ఆధారంగా చేసుకొని శతాబ్దాల తరబడి జీవనం సాగిస్తున్న పెద్ద పులులు, చిరుత పులులు, ఏనుగులు, దుప్పులు, అడవి పందులు, కుందేళ్లు ఇలా ఒక్కటేమిటి సమస్త ప్రాణాలు వేటగాళ్ల బారినుంచి తప్పించుకోలేక కాలగర్భంలో కలిసిపోతున్నాయి. అడవుల విస్తీర్ణం తగ్గడం, స్మగ్లర్ల కార్యక్రమాలు పెరగడంతో ఈ వన్యప్రాణులకు అక్కడ ఆహారం దొరక్క జనారణ్యాలపై పడుతున్నాయి. ఇటీవల అనేక ప్రాంతాల్లోని గ్రామాల్లోకి పులులు, ఎలుగుబంట్లు, అడవి పందులు, ఏనుగులు తదితర వన్యప్రాణులు ఎన్నో జనారణ్యంలోకి చొచ్చుకువచ్చి ఆహారంకోసం రైతుల పంటలపై పడుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, తదితర ఉత్తరాంధ్ర జిల్లాల్లో, రాయలసీమలోని చిత్తూరు, కడప, తదితర ప్రాంతాల్లో అడవి ఏనుగులు పంటల విధ్వంసానికి పాల్పడుతున్నాయి. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సాగు చేసిన పంటలు కళ్లముందే ఏనుగుల గుంపులు తొక్కి విధ్వంసం చేస్తుంటే వాటిని ఎలా బయటకు పంపి తమ పంటలను రక్షించుకోవాలో రైతులకు దిక్కుతోచడం లేదు. ధైర్యం చేసి అడ్డువెళ్లిన వారి ప్రాణాలు తీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో అన్నమయ్య జిల్లా ఓబులవారి మండలంలో గుండాల కోనకు వెళుతున్న భక్తులపై ఏనుగుల గుంపు సోమవారం రాత్రి దాడికి తెగబడింది. శివరాత్రి పండుగ సందర్భంగా శివుణ్ణి దర్శించుకునేందుకు వెళుతున్న భక్తుల సమూహంపై ఏనుగులు ఒక్కసారిగా దాడి చేశాయి. ఇందులో ముగ్గురు చనిపోగా మరో ఇద్దరు క్షతగాత్రులయ్యారు. మరి కొందరు తృటిలో తప్పించుకున్నట్లు చెప్తున్నారు. ఈ దాడి పట్ల ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు పదిలక్షల రూపాయలు, క్షతగాత్రులకు ఐదేసి లక్షలచొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ప్రకటించారు. ఎన్ని ఓదార్పు మాటలు చెప్పినా, మరెంత డబ్బు సహాయం చేసినా పోయిన ప్రాణాలు తిరిగిరావు.

ఇలా ఏనుగులు దాడి చేయడం ఇటీవల పెరిగిపోయిందనే చెప్పొచ్చు. ముఖ్యంగా వాటికి అడవుల్లో ఆహారం దొరక్కపోవడం వల్లనే ఇలా దాడులకు తెగబడుతున్నట్లు అటవీ అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా పంటల విధ్వంసంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సాగుచేసుకున్న పంటలు చేతికి అందనున్న దశలో వన్యప్రాణులు ధ్వంసం చేస్తుండడంతో పురుగుమందులు, కరెంట్ తీగలు పెట్టి కొన్ని ప్రాంతాల్లో చంపేందుకు కూడా వెనుకాడడం లేదు. ఇలాంటి విద్యుత్ కంచెలకు పెద్దపులులు సైతం మరణించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇక కోతులు, కొండముచ్చులు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతా కాదు. ఆ వన్యప్రాణులు తినేది తక్కువే అయినా భారీగా నష్టపరుస్తున్నాయి. ముఖ్యంగా పండ్ల తోటల రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. రాయలసీమలోని కడప, చిత్తూరు, నెల్లూరు, తదితర జిల్లాల్లో స్మగ్లర్ల ఆగడాలకు అంతే లేకుండాపోతున్నట్లు వార్తలు అందుతున్నాయి. పోలీసులు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటుచేసి కాల్పులు జరుపుతున్నా ప్రాణాలను లెక్క చేయకుండా స్మగ్లింగ్ కొనసాగిస్తున్నారు. అత్యంత విలువైన ఎర్రచందనం అటవీ సంపద కేవలం నెల్లూరు, చిత్తూరు, కడప సరిహద్దుల్లోని వెలుగొండలు, శేషాచలం అడవుల్లో మాత్రమే పెరుగుతాయి. అందుకు కారణం ఏమిటో కొన్ని వందల సంవత్సరాలుగా పరిశోధనలు చేసినా వృక్షశాస్త్రజ్ఞులు కనుగొనలేకపోతున్నారు. గతంలో ఒకసారి బ్రిటిష్ పాలకులు ఇంగ్లాండ్‌కు తీసుకువెళ్లి అక్కడ పెంచే ప్రయత్నాలు కూడా సత్ఫలితాలు ఇవ్వలేదు. ఈ అరుదైన వృక్షసంపదను కాపాడేందుకు 1973లో (కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ఇన్ ఎన్ డేంజర్డ్ స్పీసీస్)లోకి చేర్చారు. దాంతో ఎర్రచందనం ఎగుమతిపై నిషేధం అమలులోకి వచ్చింది. పరిమితిగా ఉన్న ఈ వృక్షాలను సంరక్షించుకునేందుకు వెసులుబాటు లభించింది. అయినా ఇది ఏమాత్రం ఆగడం లేదు. ఏదో ఒక రూపంలో చైనా, జపాన్ లాంటి దేశాలకు ఎగుమతి అవుతూనే ఉంది. సముద్ర మార్గాలద్వారా సరిహద్దులుదాటించేందుకు ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలు అనుసరిస్తూనే ఉన్నారు. గతంలో ఒకసారి పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇరవై మందికిపైగా చనిపోయారు. ఆ కూలీల వెనుకఉన్న అసలు స్మగ్లర్లపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. మరొకపక్క అత్యంత విలువైన టేకు లాంటి కలప వివిధ మార్గాల ద్వారా తరలిపోతూనేఉన్నది. ఇప్పటికైనా పాలకులు కళ్లుతెరవాలి. అవసరం అనుకుంటే చట్టాన్ని మరింత సవరించి కట్టుదిట్టంగా అమలు చేయాలి. అడవులను, వాటినే ఆధారంగా జీవనం సాగిస్తున్న వన్యప్రాణులను కాపాడేందుకు త్రికరణశుద్ధిగా అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు జరగాలి.

ప్రతి ఒక్కరికీ తనని గురించి బహుకొద్దిగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనని తాను తెలుసుకోవడం చాలా కష్టమైన పని.



సిసిరో

మనకున్న దానితో సంతృప్తి పడడం సబబే అయినా మన స్వభావాన్ని మాత్రం సంస్కరించుకోవాలి.



షేక్‌స్పియర్

## ప్రజావాక్కు



### మండలి సభ్యుల వల్ల ఏమి ప్రయోజనం?

ప్రభుత్వ పాఠశాలలోపనిచేస్తున్నఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఈ శాసన మండలి సభ్యుల వల్ల ఏమీ పెద్దగా ప్రయోజనం ఉండదు. ముఖ్యమంత్రి గారు ఏం తలుచుకుంటే అదే అవుతుంది. శాసనమండలి సభ్యులు ఎలాంటి మంచి ఆలోచనా ముఖ్యమంత్రి గారికి అందించలేరు. ఒకవేళమంచి ఆలోచనచెప్పినా అవి చెవిటి వాని ముందు శంఖంఅవుతుంది. ముఖ్యమంత్రులు వినడంలేదు. మేమే సాధించాంమావల్లే ఇవన్నీ ప్రభుత్వ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ప్రయోజనాలు కలిగాయి అనిసంకలు గుద్దుకునే ఉపాధ్యాయసంఘాలుగాని శాసనమండలి సభ్యులు గానీవాళ్లవల్ల సామాజిక న్యాయంజరగలేదు. ఉద్యోగంలో జాయిన్ అయిన తేదీనుండి అన్ని ఆర్థిక ప్రయోజనాలతో అమలు కావలసిన ఆనోషనల్ ఇంక్రిమెంట్లు ఇంప్లిమెంటేషన్ తేదీఅప్రెంటిస్ పూర్తయిన తేదీగా పరిగణలోకి తీసుకున్నారు. ఇది వారికి ఏ రకంగా సమంజసం .

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### అనుమతి లేని ట్యుటోరియల్స్‌పై చర్యలు

తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని మండలకేంద్రాలలో విద్యాశాఖ ద్వారా అనుమతి లేకుండా నడుస్తున్న ట్యుటోరియల్స్ పైచర్యతీసుకోవాలి. తగినంత విద్యార్హతటీచర్ ట్రైనింగ్ లేని కొందరు దర్జాగా ట్యుటోరియల్స్ నడుపుతున్నారు. అట్టివారినిగుర్తించి విద్యాచట్టంప్రకారంశిక్షించాలి. ట్యుటోరియల్స్‌ను రద్దుచేయాలి. చిన్నపిల్లలను విద్యాపరంగా అడ్మిషన్‌లేకుండా మోసంచేస్తున్నారు. తల్లిదండ్రుల నుండి వేల సంఖ్యలో ఫీజులు వసూలు చేస్తున్నారు. మండల విద్యాశాఖఅధికారి పర్యవేక్షణలో ఇట్టివాటిని రద్దు చేయాలి. ఇరుకు ఇరుకుగదులలో తగిన వసతులు లేని ట్యుటోరియల్స్ కేవలం ధనార్జన లాభదృష్టిలో మాత్రమే నెలకొల్పడం జరుగుతుంది. వాటిని రద్దు చేయాలి.

- రాపాక రవీందర్, జనగామ

### పాల కల్తీని అరికట్టాలి

దేశవ్యాప్తంగా లభించే పాలలో68శాతం కల్తీవేనని ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థసర్వే తేల్చి చెప్పింది. కల్తీ పాల వల్ల క్యాన్సర్లు, జీర్ణాశయ సమస్యలు, పిల్లల్లో వినికిడి, దృష్టి లోపాలు తలెత్తవచ్చు. అధికారులు పాల కల్తీని అరికట్టాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.

-మా.శ్రీ.రాజు, పాల్వంచ

### పెన్షన్ చెల్లింపుల్లో హెచ్చుతగ్గులు

కోల్ ఇండియా, సింగరేణి బొగ్గు గని అధికారులకు కార్మికులకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా దాదాపు ఐదులక్షల మందికి పింఛన్ చెల్లిస్తున్నారు. అధికారులు, కార్మికుల వద్ద బేసిక్ నుంచి ఏడు శాతం వసూలు చేసి యాజమాన్యాలు ఏడుశాతం కలిపి పెన్షన్‌ఫండ్‌కు జమచేస్తున్నారు. పదవి విరమణ తర్వాత వారి బేసిక్, మారేడు కరువు భత్యంపై ఇరవై శాతం పెన్షన్ చెల్లిస్తున్నారు. నవంబర్ 2024సం॥వరకు రూ.3389.53 కోట్లు పెన్షన్ ఫండ్‌కు వచ్చాయి. కానీపెన్షన్ చెల్లింపులు 3705.76 కోట్లు చెల్లింపులు జరిగాయి. పెన్షన్ ఫండ్‌కు వచ్చిన మొత్తం కంటే 316.23కోట్లు తక్కువ జమకావడంతో చెల్లింపుల మధ్య ఆంతర్యం పెరుగుతుంది. 2021సంవత్సరంనుంచి కోల్ ఇండియా, సింగరేణి సంస్థలు టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.10 పెన్షన్ ఫండ్‌కు జమ చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన కమిటీ సమావేశంలో ప్రతిటన్ను బొగ్గుఉత్పత్తిపై 20లేదా25 రూపాయలు కోల్ ఇండియా కాంట్రిబ్యూషన్ చెల్లించేందుకు కుదిరిన అంగీకారం అమలు పరచాలి.

-ఆళవందార్ వేణుమాధవ్, హైదరాబాద్

### టిక్కెట్ ధరలను తగ్గించాలి

ఏపిఎస్ఆర్‌టీసి, ఏ.సి బస్‌చార్జీలు బేసిక్ టికెట్‌కు అదనంగా టోల్ ఫీజు, లేవీ ఫీజు, రిజర్వేషన్ ఫీజు కలిపి ఒక టికెట్‌కు సీనియర్ సిటిజన్ అయిన మరీ ఎక్కువగాఉంది. ఆధార్ నెంబర్ ఇచ్చినా టికెట్‌లో తగ్గింపులేదు. లేవీ ఫేసు డీసెల్ పెంపు కారణంగా ఉంటే బేసిక్ టికెట్ ధర కొంత పెంపు సాధారణం. దీని కారణంగా రైలు ప్రయాణమే ఇబ్బంది అయిన తప్పదు. లేవీ ఫీజునీ మినహాయింపు చేయడం సబబు.

-బొల్లోజు మెఘానాథం, విశాఖపట్నం

### తీగల కింద చెట్లు నాటొద్దు

పచ్చదనం కోసంరోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం చేస్తుంటారు. రోడ్ల వెంబడి విద్యుత్తు లైను నడపబడి ఉన్నా అవేవీ పట్టించుకోకుండా మొక్కలు నాటేస్తున్నారు. అవిపెరిగి పెద్దయ్యాక విద్యుత్ తీగలకు అడ్డు వస్తుండడంతో వాటి కొమ్మలు కొట్టి వేసి మోడుగా మిగిలిస్తున్నారు. మొక్కలను నాటి వాటికి నీరు పోసి, జంతువుల నుండి కాపాడేందుకు ఫెన్సింగ్ వేసి వాటినిచెట్లుగా మార్చడంచాలా వ్యయప్రయాసతో కూడిన పని. ఇంత చేశాక విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మొక్కలను ఎదగనీయకుండా కొమ్మలు నరకడం చూస్తున్నాం.

-సి. చంద్రశేఖర్, నెల్లూరు జిల్లా

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# పరీక్షలపై అవగాహనతోనే మంచి ఫలితాలు

**పిండికొద్ది రొట్టె అనేసామెత ఉండనే ఉంది. మొదటి నుండి పట్టించుకోకుండా ఇప్పుడు ఇలా పరీక్షల ముందు హడావిడి చేసి, పక్కవారితో పోల్చి, నిష్టూరాలు ఆడితే అనర్థాలు జరిగే అవకాశం ఉంది. కొంత మంది పిల్లలు బాగా వెనుకబడి ఉంటారు. కావున అటువంటి వారికి తక్కువ అంశాలు ఇచ్చి వారు నేర్చుకుని చెప్పిన ప్రతీసారి వారిని అభినందిస్తూ, ప్రోత్సహిస్తే వారిలో ఇంకా చదవాలనే కాంక్ష పెరుగుతుంది. మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఉన్న ఈ తక్కువ సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకొని ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించడం ఏమంత కష్టం కాదు. పిల్లవాడి స్థాయిని అర్థం చేసుకుని వారికి సరైన మార్గదర్శనం ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. తెలిసిన విషయాలనే స్పష్టంగా, చక్కగా రాసేవిధానం అవలంభించడం ద్వారా చక్కటి మార్కులు పొందవచ్చు. ఇలాంటి సూచనలు పాటించి విద్యార్థులను ప్రోత్సహిస్తే చక్కటి ఫలితాలు సాధించవచ్చు.**



కాళంరాజు వేణుగోపాల్

విద్యార్థి జీవితంలో పదవ తరగతి అనేది ఒక మంచి మలుపు. అప్పటివరకు ఏదో సాదాసీదాగా పరీక్షలు రాసి పాసవుతూ, ఇప్పుడుపబ్లిక్ పరీక్షలంటే ఒక్కసారిగా కొంచెంభయం ఏర్పడడం ఏ విద్యార్థి కైనా సహజం. కానీ కొంచెం ప్రణాళికా బద్ధంగా, చక్కటి ప్రిపరేషన్‌తో కష్టపడితేమంచి ఫలితాలు సాధించడం ఇబ్బందేమీ కాదు. ఎప్పటికప్పుడు మారిన అంశాలకు సంబంధించి పూర్తి అవగాహన సాధించి, పరీక్షలకు ప్రిపేర్ అవడం మంచిది. అంతేకాక ప్రతీ సెంటర్లోని ప్రతీ రూమ్ కూడా సీసీ కెమరాలు బిగించాలని ఈ మధ్య ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారు. కాబట్టి కొంచెం జాగ్రత్త వహించడం ఎంతైనా అవసరం. లేకపోతే కొత్త ఇబ్బందులను కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇరు రాష్ట్రాలలో పదవ తరగతి విద్యార్థులకు వచ్చే నెల నుండి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. మొదటిసారి పరీక్షకు హాజరవడం మూలానా, ఎంత కాదనుకున్నా కొంత ఒత్తిడికి గురయ్యే ప్రమాదముంది. అయితే చక్కటి ఆత్మ విశ్వాసంతో పరీక్షకు వెళ్లగలిగితే అద్భుతాలు సృష్టించవచ్చు. పిల్లలలో సహజంగా ఉండే పరీక్ష భయాన్ని పోగొట్టేటట్లు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు ధైర్యం పెంపొందించాలి. విద్యార్థి స్థాయిని అర్థమయ్యేటట్లు చెప్పి ఇంకా ఏ రకంగా మెరుగుపడవచ్చో చిన్నచిన్న సలహాలు ఇస్తే సరిపోతుంది. ఇంట్లో తల్లిదండ్రులు కూడా లేనిపోని భయాలు అపోహలు సృష్టించి పిల్లలను గందరగోళంలో నెట్టకుండా వారికి ధైర్యం నూరి పోసి పరీక్షలకు సంసిద్ధం చేస్తే చక్కటి ఫలితాలు రాబట్టవచ్చు. ముఖ్యంగా ఇంకా పరీక్షలకు 20 రోజుల సమయం మాత్రమే ఉన్నది. మంచి మార్కులు సాధించాలనుకున్న విద్యార్థులు జాగ్రత్తగా సమయాన్ని కేటాయించుకొని వారు ఏ ఏ విషయాలలో వెనుకబడి ఉన్నారో, ఏ ఏ అంశాలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో పసిగట్టి దానిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఒక రోజులో వారు ఎక్కడ సమయాన్ని వృధా చేస్తున్నారో తెలుసుకొని దాని విషయంలో జాగ్రత్త వహించాలి. ఇక ఈ ఇరవై రోజులు చాలా కీలకం. మంచి మార్కులు తెచ్చుకోవాలంటే ఏ ఒక్క అంశం వదిలేయకూడదు. ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా చదివి ముఖ్యమైన విషయాలను ప్రత్యేకంగా చదవాలి. చదివేటప్పుడు ముఖ్యమైన అంశాలను అండర్ లైన్ చేసుకోవడం, అర్థం కాని విషయాలను ప్రత్యేకంగా నోట్‌చేసుకుని, ఉపాధ్యాయులతో చెప్పించుకోవడం, తోటి విద్యార్థులతో చర్చించడం వలన మంచి ఫలితం ఉంటుంది. మన లక్ష్యాన్ని అనుక్షణం గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా మన మీద మనకు నమ్మకం ఉంచుకోవాలి. అదే సమయంలో అతివిశ్వాసం పనికిరాదు. మనం ఏ విషయంలో అయితే వెనుకబడ్డామో అట్టి విషయాల మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. అంతేకానీ వచ్చిన లేదా నచ్చిన విషయాలనే పదే పదే చదివి కాలాన్ని వృధా చేసుకోకూడదు. పరీక్షలంటే ఎక్కువ భయం పెంచుకోకూడదు. దానివలన ఒత్తిడి పెరుగుతుంది. అతిగా నిద్ర మేల్కొని చదవడం కూడా మంచిది కాదు. సరియైన సమయంలో సరిపడినంతా ఆహారం తీసుకొని, చక్కగా నిద్రపోతే మిగిలిన సమయం చక్కగా చదువుకోవచ్చు. మెదడు మీద కూడా ఒత్తిడి ఎక్కువగా పడదు. పరీక్షలంటే అదేదో పెద్ద భూతంలా కాకుండా మనం చదివిన దానిని కేవలం పరీక్షిస్తున్నారు అనే భావం పెంచుకుంటే మేలు. అనవసర విషయాల మీద ఆసక్తిని తగ్గించుకొని మీ రోజువారీ సమయానికనుగుణంగా ఒకగంట అధికంగా చదువుకుంటేచాలు. అలాగే అతి ముఖ్యమైన విషయం ఎంత సేపు చదివామన్నది కాదు ముఖ్యం, ఎంత ఆసక్తిగా చదివామన్నదిముఖ్యం. అత్యంత ముఖ్యమైనది ఎక్కువ మంది విద్యార్థులు వారికి ఇష్టమైన సబ్జెక్టులను మాత్రమే పదేపదే చదివి మిగతా సబ్జెక్టులను నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ అన్నింటిలో మంచి మార్కులు వస్తేనే మంచి ర్యాంక్ సాధిస్తారు అన్న సంగతి గుర్తుంచుకోవాలి. అంటే మీకు ఏ సబ్జెక్టులో లేదా ఏ అంశాలలో అయితే కొంచెం వెనుకబడి ఉన్నారో వాటికి సంబంధించిన అనుమానాలను మీ ఉపాధ్యాయులను, పెద్దవారిని, తోటి స్నేహితులను అడిగి నివృత్తి చేసుకుంటే మంచిది. అలాగే ఇప్పటికే చదవడం పూర్తి చేసిన వారుంటే, ఈఇరవై రోజులు చక్కగా ప్రణాళిక రచించుకొని బాగా క్లిష్టతరమైన అంశాలకు తగు ప్రాధాన్యత ఇచ్చి తగిన విధంగా చదివితే మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. ఉపాధ్యాయులు కూడా ఎంతో అనుభవం ఉండి, ఎంతో మంది విద్యార్థులను చూసి ఉంటారు. కావున విద్యార్థులను అతిగా బెదిరించవద్దు. సాధ్యమైనంతవరకు వారిని స్వేచ్ఛగా చదివేటట్లు ప్రోత్సహించాలి. చిన్న చిన్న పొగడ్తలు ఇవ్వడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుంది. మిగతా వారితో పోల్చి చూడవద్దు. ఒక్కొక్కరిలో ఒక్కో బలం ఉంటుంది. ఎవరి ప్రత్యేకత వారిదే. గ్రామీణ ప్రాంతం వారికి, పట్టణప్రాంతం విద్యార్థులకు కొంచెం తేడా ఉంటుంది. కాబట్టి ప్రతీ విషయంలో పక్కవారిని పోల్చి చెప్పడం వల్ల వారిలో కొంత నైరాశ్యం ఏర్పడే ప్రమాదం ఉంది. విద్యార్థుల వైయక్తిక తేడాను అనుసరించి అవసరమున్న వారికి ప్రత్యేక సమయం కేటాయించడము మంచిదే. కొంత మంది తల్లిదండ్రులు వారి పిల్లలకు పరీక్షలనగానే ఎక్కడ లేని హైరానా పడుతుంటారు. సరిగా తిననివ్వరు, మాట్లాడనివ్వరు, పడుకోనివ్వరు, ఏ పని చేయనివ్వరు. ప్రతీసారి పక్క పిల్లలతో పోల్చి అనుమానించి, అవమానిస్తుంటారు. కనీసం అలా చేస్తే నైనా చదువతారని గుడ్డి నమ్మకం. ఈ విధంగా చేయడం లాభం కంటే నష్టం ఎక్కువ. ప్రతీక్షణంవెంటబడి, అదేపనిగా సాధించి, చీటికిమాటికి తిట్టి ఏదో ఆశిస్తే ఇంకేదో జరిగే ప్రమాదం పొంచి ఉంది. పిండికొద్ది రొట్టె అనేసామెత ఉండనే ఉంది. మొదటి నుండి పట్టించుకోకుండా ఇప్పుడు ఇలా పరీక్షల ముందు హడావిడి చేసి, పక్కవారితో పోల్చి, నిష్టూరాలు ఆడితే అనర్థాలు జరిగే అవకాశం ఉంది. కొంత మంది పిల్లలు బాగా వెనుకబడి ఉంటారు. కావున అటువంటి వారికి తక్కువ అంశాలు ఇచ్చి వారు నేర్చుకుని చెప్పిన ప్రతీసారి వారిని అభినందిస్తూ, ప్రోత్సహిస్తే వారిలో ఇంకా చదవాలనే కాంక్ష పెరుగుతుంది. మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఉన్న ఈ తక్కువ సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకొని ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించడం ఏమంత కష్టం కాదు. పిల్లవాడి స్థాయిని అర్థం చేసుకుని వారికి సరైన మార్గదర్శనం ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. తెలిసిన విషయాలనే స్పష్టంగా, చక్కగా రాసే విధానం అవలంభించడం ద్వారా చక్కటి మార్కులు పొందవచ్చు. ఇలాంటి సూచనలు పాటించి విద్యార్థులను ప్రోత్సహిస్తే చక్కటి ఫలితాలు సాధించవచ్చు. ●



# యువతపై పెరుగుతున్న సోషల్ మీడియా ప్రభావం

డాక్టర్ మోటె చిరంజీవి

ఉదయం లేచింది మొదలు, రాత్రి పడుకునే వరకు సోషల్ మీడియాలోనే గడిపేస్తున్నారు. పల్లెల నుంచి పట్టణాల వరకు, చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ప్రతీ ఒక్కరూ సోషల్ మీడియాకు అడిక్ట్ అవుతున్న రోజులివీ. స్మార్ట్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరిగిపోవడం, ఇంటర్‌నెట్ ఛార్జీలు అందుబాటులోకి రావడంతో ప్రతీఒక్కరూ సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. స్మార్ట్ ఫోన్‌చేతిలో ఉంది కదా అని ఏది పడితే అది పోస్ట్ చేయకూడదని టెక్ నిపుణులు చెబుతున్నారు. సోషల్ మీడియా కొన్ని సంవత్సరాలుగా విస్తరించింది. యువతరానికి వార్తల వనరుగా ప్రజలను అనుసంధానించే డిజిటల్ ఫోరమ్ నుండి పరిణామం చెందింది. పిల్లలు మొదలుకొని పెద్దల వరకు ప్రతి ఒక్కరు వారి సెల్‌ఫోన్ల ద్వారానే ప్రపంచంలో జరిగే ఎటువంటి విషయాలను అయినా తెలుసుకుంటున్నారు. అందులో మంచివి ఉన్నాయి. చెడ్డవి ఉన్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్లలో వివిధ రకాల యాప్‌ల ద్వారా సోషల్ మీడియాలో ఏం జరుగుతుంది అనే విషయాన్ని తెలుసుకోవచ్చు. సోషల్ మీడియా ఒక కీలకమైన శక్తిగా నిలుస్తుంది. ఇది మనం ఎలా కమ్యూనికేట్ చేస్తామో, దీంతో ఎలా పని చేస్తామో కనెక్ట్ అవుతామో మనకు తెలియదు. మనకు తెలియకుండానే దానికి కనెక్ట్ అవుతాం. విద్యార్థులు, యువత, పెద్దలు, ఉద్యోగులు, ఎక్కువగా ఉపయోగించే వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, స్కైప్ వంటి వాటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. అయితే ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా వాడకం వల్ల సైబర్ స్టాకింగ్, సైబర్ బెదిరింపు, ట్రోలింగ్ వంటి వాటికి గురికావచ్చు. ఇది ఒత్తిడి, ఆందోళన నిరాశకు దారితీస్తుంది. సోషల్ మీడియాలో కొత్త వార్తలు, కంటెంట్, ఆన్‌లైన్ గేమ్‌లు, ఉత్సాహం వినోదంతో పిల్లలని వ్యసనపరుస్తున్నది. నిరంతరం ఎక్కువగా ఉపయోగించడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అవసరం ఉన్నా లేకున్నా ప్రస్తుతం సమాజంలోని వ్యక్తులు తరచుగా సోషల్‌మీడియా సైట్‌లను నిరంతరం తనిఖీచేసి, వివిధ రకాల వీడియోలను కంటెంట్లను చూడడం, చదవడం జరుగుతుంది. మీరు ఆన్‌లైన్‌లో లేకపోతే ఏదైనా మిస్ అవుతారనే ఆలోచన మీ మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. సోషల్ మీడియా అనేది ప్రజలు వ్యక్తిగత చిత్రాలుసమాచారాన్ని పంచుకునే వేదికగా మారింది. ప్రజల ఆమోదం ప్రశంసలను కోరుకుంటుంది. ఇది స్వీయఇమేజ్ సమస్యలకు దారితీస్తుంది. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ లింక్డ్ఇన్ వంటి ప్లాట్‌ఫామ్‌లు మన దైనందిన జీవితాల్లో సజావుగా కలిసిపోయాయి. సోషల్‌మీడియా బ్రాండ్ అవగాహనను పెంచుతుంది. సోషల్ మీడియా కంపెనీ పని తీరును విశ్లేషించి, ఉత్పాదకతను ఎలా మెరుగుపరచాలో తెలుసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా 4.2బిలియన్ల క్రియాశీల వినియోగదారులతో, ఇది ఇప్పుడు మన దైనందిన జీవితంలో ఒక భాగమైంది. నిద్రసమస్యలు, ఒత్తిడి, ఆందోళన, మానసిక కల్లోలం వంటి సమస్యలు వచ్చే ప్రమాదంఉంది. నిరాశ, ఒంటరితనం, స్వీయహాని, ఆత్మహత్య ఆలోచనలు వచ్చే ప్రమాదంఉంది. సైబర్ బెదిరింపులకు గురయ్యేప్రమాదం ఉంది. గోప్యతా సమస్యలు వచ్చేప్రమాదం ఉంది. రాజకీయాలను గణనీయంగా ప్రభావితం చేసింది. ఈరోజుల్లో, చాలామంది ప్రజలు వాటిద్వారానే వార్తలను పొందుతున్నారు. కొన్నిసార్లు సాంప్రదాయ మాధ్యమాల కంటే ముందే రాజకీయ ఇతరవార్తలను యాక్సెస్ చేయడానికి ఈమాధ్యమం సులభమైన మార్గం. ఇంతకీ సోషల్ మీడియాలో ఎట్టి పరిస్థితుల్లో షేర్ చేయకూడని అంశాలు డీప్‌ఫేక్ వీడియోలు వంటి భయానక పరిస్థితులు ఉన్న ప్రస్తుత రోజుల్లో పర్సనల్ ఫొటోలను ఎట్టి పరిస్థితుల్లో షేర్ చేయకూడదు. డీపీలుగా కూడామీ వ్యక్తిగత ఫొటోలు పెట్టుకోకపోవడమే మంచిది. ఈఫొటోలను సేకరించి కొందరు ఫేక్‌వీడియోలు తయారు చేసి, బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం ఉందని గుర్తించాలి. ఇకకొందరు ఎక్కడికివెళ్తున్నారో ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్‌చేస్తున్నారు. దీనివల్ల మీరు ఇంట్లోలేరన్న విషయాన్ని దొంగలకు మీరేచెప్పినట్లు అవుతుంది. ఇలాంటి వ్యక్తిగత విషయాలను ఎప్పటికీ షేర్ చేసుకోకూడదు. ●

# ప్రభుత్వ నియంత్రణలో ఎన్నికల కమిషన్!

ఎం.కె.కుమార్

భారత ప్రభుత్వం ఇటీవల శ్రీ జ్ఞానేశ్‌కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించింది. ఈ నియామకం 'ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టం, 2023' ప్రకారం జరిగింది. జ్ఞానేశ్‌కుమార్ కేరళ కేడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఇంతకుముందు, ఆయన కేంద్ర హోంశాఖలో కీలకపాత్ర పోషించారు. జమ్మూకాశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 రద్దు బిల్లులో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల కమిషన్ (ఈసిఐ) కీలక భూమికను పోషిస్తుంది. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడమే దీని ప్రధాన బాధ్యత. అయితే 2023లో అమలులోకి వచ్చిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టం ఎన్నికల సంఘం స్వాతంత్ర్యాన్ని హాని చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ చట్టం ఈసిఐని పూర్తి స్వతంత్ర సంస్థగా కాకుండా, రాజకీయ కార్యనిర్వాహకుడి ఆధీనంలోకి తెచ్చేలా మారుస్తుంది. దీన్ని రాజకీయ, న్యాయ నిపుణులు విమర్శిస్తున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం, ఎన్నికల కమిషన్ పార్లమెంటరీ, శాసనసభ ఎన్నికల నిర్వహణ బాధ్యతను తీసుకుంటుంది. 1949లో రాజ్యాంగ సభలో ఈ అంశం చర్చించబడింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్వతంత్ర ఎన్నికల కమిషన్ ఏర్పాటును ప్రజాస్వామ్యానికి అత్యవసరమైన అంశంగా పేర్కొన్నారు. అంబేద్కర్ తన ప్రసంగంలో, 'ఎన్నికల కమిషన్ కార్యనిర్వాహక నియంత్రణకు వెలుపల ఉండాల్సిన ప్రాథమిక అవసరం ఉన్నది' అని స్పష్టం చేశారు. అంటే, ప్రభుత్వ ప్రమేయం లేకుండా పనిచేసే స్వతంత్ర సంస్థగానే ఎన్నికల కమిషన్ ఉండాలి. అయితే 2023 చట్టం ఆ ఉద్దేశాన్ని దెబ్బతీసేలా ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కొత్త చట్టం ద్వారా ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక విధానం పూర్తిగా మారింది. గతంలో సుప్రీంకోర్టు తీర్పు మేరకు, ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తిలతో కూడిన కమిటీ ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించేది. అయితే, 2023 చట్టం ద్వారా ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర మంత్రివర్గానికి చెందిన ఒక సభ్యుడిని చేర్చారు. ఇది ఎన్నికల కమిషనర్ నియామకంపై ప్రభుత్వం మితిమీరిన అధికారం కలిగివుండేలా చేస్తుంది అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధానంగా, ఇది ఎన్నికల కమిషన్‌ను నిష్పాక్షికంగా కాకుండా, అధికారంలో ఉన్నపార్టీకి అనుకూలంగా మార్చే ప్రమాదం ఉన్నది. ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టు కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. మార్చి 2023లో, అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ఇండియా కేసులో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పు చెప్పింది. ఎన్నికల కమిషనర్ల నియామక విధానంపై పారదర్శకత అవసరమని తీర్పు చెప్పింది. అయితే, ప్రభుత్వం ఈ తీర్పును అమలు చేయలేదు. తనకు అనుకూలంగా ఉండేలా కొత్త నియామక వ్యవస్థను రూపొందించింది. మాజీ ఉప ప్రధాని ఎల్.కె. అద్వానీ 2012లో అప్పటి ప్రధాన మంత్రి





డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు లేఖరాశారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక ప్రక్రియ ప్రజల్లో విశ్వాసాన్ని కలిగించకపోవడం వల్ల దీనిని పారదర్శకంగా మార్చాల్సిన అవసరంఉందని సూచించారు. కానీ, 2023చట్టం ఈ సూచనలను పాటించకుండా, ప్రజాస్వామ్య మూలాలను మరింత బలహీనపరిచేలా మారింది. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. ఈసిఐ నిష్పాక్షికత దెబ్బతినే ప్రమాదం వుంది. ఎన్నికల కమిషనర్ల నియామకంపై కేంద్ర ప్రభుత్వ అధికారం పెరిగితే, కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించలేని పరిస్థితి వస్తుంది. ఎన్నికల స్వేచ్ఛపై భయాలు పెరుగుతాయి. రాజకీయ పక్షపాతం లేకుండా ఎన్నికలు నిర్వహించాల్సిన కమిషన్ ప్రభుత్వ నియంత్రణలోకి వెళుతుంది. భవిష్యత్ ఎన్నికల నిష్పాక్షికతపై అనేక సందేహాలు కలుగుతాయి. దీనివల్ల ఎన్నికలపై ప్రజల విశ్వాసం తగ్గే అవకాశం వుంది. ఓటింగ్ ప్రక్రియ, ఎన్నికల ఫలితాలపై ప్రజలు ఒక వేళ అనుమానం కలిగితే, అది ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ప్రమాదంగా మారుతుంది. ఇటీవల, లక్షలాది మంది ఆందోళన చెందుతున్న పౌరులు, న్యాయవాదులు, రాజకీయ నిపుణులు ఈ అంశంపై గౌరవ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1)ప్రకారం, రాష్ట్రపతి సుప్రీంకోర్టును సంప్రదించి, ఈ కొత్తచట్టం రాజ్యాంగబద్ధమా లేదా అనే దానిపై మార్గదర్శకత కోరవచ్చు. "ప్రజాస్వామ్య మూలాలను కాపాడడం మీ బాధ్యత" అనే అభిప్రాయంతో, ఈసిఐ నియామక వ్యవస్థపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యాన్ని, స్వతంత్ర ఎన్నికలను భద్రపరిచేలారూపొందించబడింది. కానీ, 2023లో అమలులోకి వచ్చిన ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకచట్టం, ఈసిఐ స్వతంత్రతను ప్రమాదంలో పడేసేలాఉంది. అందుకే, ఈ చట్టాన్నితిరగదిద్దే విధంగా పార్లమెంటులో చర్చజరపాలి. రాష్ట్రపతిసుప్రీంకోర్టు ద్వారా సిఫారసులు కోరాలి. ప్రజాస్వామ్యం బలహీనపడకుండా, ఈసిఐ పూర్తిగా రాజకీయ స్వతంత్రంగా ఉండేలా మార్పులు అవసరం. రాజ్యాంగ నిర్మాతలు కలలు కన్న స్వతంత్ర ఎన్నికల వ్యవస్థను కాపాడటానికి ప్రజలు, న్యాయ నిపుణులు, రాజకీయ నాయకులు కలసి కృషి చేయాలి. లేదంటే, ఒక రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం నెమ్మదిగా ఏకపక్ష పాలన వైపు దారితీయబడే ప్రమాదం ఉంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా నిలవడానికి, ఎన్నికల కమిషన్ పూర్తిగా స్వతంత్రంగా ఉండటం అత్యంత కీలకం. 2023 ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం, ప్రభుత్వం అధిక నియంత్రణ కలిగి ఉండేలా మార్పులు చేయడంవల్లఎన్నికల స్వేచ్ఛ, నిష్పాక్షికతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ఈ విధానాన్ని పునరాలోచించకపోతే, ప్రజల నమ్మకం తగ్గిపోవడమే కాకుండా, ఎన్నికల వ్యవస్థపై అనిశ్చితి నెలకొంటుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయపార్టీలు, న్యాయ నిపుణులు, పౌర సమాజ సంస్థలు కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల కమిషన్ నియామక ప్రక్రియ మరింతపారదర్శకంగా ఉండేలా మార్పులు చేయాలి. అదేవిధంగా, రాష్ట్రపతి ఆర్టికల్ 143(1) ప్రకారం సుప్రీంకోర్టు అభిప్రాయం కోరితే, ఈ చట్ట రాజ్యాంగ బద్ధతపై స్పష్టత వస్తుంది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్య విలువలు రక్షించబడతాయి. రాజ్యాంగ నిర్మాతలు కలలుకన్న స్వతంత్ర ఎన్నికల వ్యవస్థను కాపాడడం నేటి సమాజ బాధ్యత. లేకుంటే, ప్రజాస్వామ్య వ్యవస్థ నెమ్మదిగా ఏకపక్ష పాలన వైపు మళ్లే ప్రమాదం ఉంది. అందువల్ల, ఎన్నికల కమిషన్ పూర్తిగా స్వతంత్రంగా ఉండేలా కఠినమైన రాజ్యాంగ భద్రత అవసరం. ●

05ATP25_05ATP25.qxd 25-02-2025 PM 10:43 Page 1



## చికెన్ వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు



చికెన్, గుడ్డు వడ్డిన పదార్థాలను ఉచితంగా అందచేస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

చికెన్ తినడం వల్ల ఎలాంటి ప్రమాదం వుండదని తాడిపత్రి పట్టణంలోని యల్లనూరు రోడ్డులో వున్న వరదరాజులురెడ్డి కోళ్ల ఫాం నిర్వాహకులు సోమనాథరెడ్డి పేర్కొన్నారు. చికెన్, కోడిగుడ్డుపై వున్న అపోహలను పోగొట్టేందుకు వెంకాబ్ చికెన్ కంపెనీ వారు 200కిలోల చికెన్ పకోడా, చికెన్ కర్రీ, 2 వేల బాయిల్డ్ గుడ్ల మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వారికి చికెన్‌తో తయారు చేసిన పదార్థాలతో పాటు కోడి గుడ్లను ఉచితంగా అందచేశారు. పిల్లలు, పెద్దలు సైతం వాటిని తినేందుకు ఉత్సాహపడ్డారు. ఈ సందర్భంగా సోమనాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సామాజిక మాద్యమాల్లో చికెన్‌పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు ఈ మేళా నిర్వహించడం జరిగిందని ఆయన మీడియాకు తెలియచేశారు.

## శ్రీకోనవీరాంజనేయస్వామికి ఆకుపూజలు

**తాడిపత్రిరూరల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



మండలంలోని ఆలూరుకోనలో వెలసిన శ్రీకోనవీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు స్వామివారికి ఆకుపూజలు చేయించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా శ్రీరంగనాథస్వామి, శ్రీషిరిడిసాయిబాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులు అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు.

## గజవాహనంపై శ్రీబుగ్గరామలింగేశ్వరుడు

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి పరమేశ్వరుడు గజవాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు శంకరయ్య శర్మ, గిరిశర్మలు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఇందులో భాగంగా గణపతిపూజ, పుణ్యా హవాచనము, గణపతిహోమము. వేదపారాయణము, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, తదితర పూజలు నిర్వహించారు. అలాగే శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు నందుస్వామి, రామకృష్ణశర్మలు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి, నవగ్రహాలకు అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజినేయులు, కమిటీ సభ్యులు చంద్రమోహన్‌నాయుడు, ఆలయ సిబ్బంది విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శివుని వెండి ముఖకవచం అందజేత



శివుని వెండి ముఖకవచం తీసుకొస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని శ్రీఅంబాభవాని దేవాలయంలో వున్న పరమేశ్వరునికి 4 కిలోల వెండి ముఖకవచాన్ని కేందోలే చంద్రశేఖర్‌రావు, మల్లికార్జునరావు కుటుంబసభ్యులు అందచేశారు. ఈ సందర్భంగా వారు కృష్ణాపురం జీరో రోడ్డు నుండి శివును వెండి ముఖ కవచంతో శ్రీఅంబాభవాని దేవాలయం వరకు ఊరేగింపుగా వచ్చి స్వామివారికి సమర్పించారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయంలో స్థల శుద్ధి గణపతిపూజ, నవగ్రహ పూజ, అష్టదిక్పాలక, కలశ పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున తాడిపత్రి స్వకులసాలి సమాజ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**అనంతపురం వైద్యం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

అనంతపురం పట్టణం ఒకటవ రోడ్డు నందు ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర, కోదండరామ స్వామి దేవస్థానం నందు మహాశివరాత్రి ద్వాదశ దశమ బ్రహ్మోత్సవాలు ఈనెల 19వ తేదీ నుండి అతి వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో, అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ దేవస్థానము నందు జరుగుతున్న ఏర్పాట్లును ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సంతృప్తిని వ్యక్తం చేస్తూ రేపటి రోజున అనగా మహాశివరాత్రి పండగ పర్వదినం రోజున అధిక సంఖ్యలో విచ్చేయు భక్తులకు ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారి దర్శనం భక్తులకు కల్పించాలని అందుకు తగ్గ ఏర్పాట్లు చేయవలసినదిగా ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని భక్తులకు చలువ పందిళ్లు, క్యూ లైన్లు, త్రాగునీరు, మజ్జిగ ప్రసాద వినియోగం తగినంతగా ఏర్పాట్లు చేసి దేవస్థానమునకు వచ్చు భక్తులు సులభంగా స్వామి వారిని దర్శించుకొనుటకు ఏర్పాటు చేయవలసినదిగా సూచించి ఉన్నారు. ఆయన సూచనల మేరకు ఇప్పటికే దేవాలయ ప్రాంగణమంతా సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాల అలంకరణతో, భక్తులు సులభంగా స్వామివారిని దర్శించుకునేలా ప్రత్యేక దర్శనం మరియు సర్వదర్శనములు ఉండేలా రెండు క్యూ లైన్ లను ఏర్పాటు చేసి చలువ పందిళ్ళు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే భక్తుడు గుడిలోనికి అడుగుపెట్టగానే దేవాలయ ప్రాంగణం పరిసర ప్రాంతాలు శివనామస్మరణంతో పులకించిపోయేలా వివిధ దేవతల దేవతా మూర్తుల ప్రతిములు రంగు రంగుల చిత్రాలతో దేవస్థానం కాంపౌండ్ గోడలపైన దేవస్థానఆవరణంలో కళాకారులు కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ వారు వేసిన చిత్రాలు చూపరులను ఆకట్టుకునేలా దేవాలయాన్ని సుందరంగా ముస్తాబు చేశాం. ఈ సందర్భంగా దేవస్థానం నందు భక్తులకు మెరుగైన సేవలు అందించే విషయంలో టిడిపి సీనియర్ నాయకులు నరేంద్ర చౌదరి, ఆలయ మాజీ చైర్మన్ జి. జె. వేణు, ఎర్రి స్వామి, రాజు తదితరులు ఆధ్వర్యంలో శివ సేవా సమితి సభ్యులు, యస్.ఆర్. డిఫెన్స్ అకాడమీ రాచానపల్లి సభ్యులు, వాలంటీర్స్ తో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి వారి సేవలు సహాయ సహకారాలు రేపటి మహాశివరాత్రి పండుగ రోజున భక్తులకు అందించవలసినదిగా కోరుతూ సమీక్ష సమావేశాన్ని నిర్వహించడమైనది. భక్తులకు దర్శనానంతరం ఉదయం నుంచి నిరాటంకంగా దేవస్థానం తరపున దేవస్థానం నుండి ఉచితంగా ప్రసాదం ని అందజేయడం జరుగుతుంది. మహాశివరాత్రి రోజున అర్థరాత్రి తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుంది కావున భక్తాదులందరూ విరివిగా పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావలసిందిగా కోరారు

## ఎమ్మెల్యే సొంత నిధులతో మున్సిపాలిటీకి చెత్త సేకరణ వాహనాలు అందజేత



చెత్త సేకరణ వాహనాలను అందచేసిన దృశ్యం

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి సొంత నిధులతో తాడిపత్రి మున్సిపాలిటీకి నాలుగు చెత్త సేకరణ వాహనాలను అందచేశారు. తాడిపత్రి మున్సిపాలిటీలో చెత్త సేకరణ వాహనాలు తక్కువగా వుండడంతో చెత్త సేకరణ కోసం ఎమ్మెల్యే జె.సి సొంత నిధులతో సమకూర్చిన నాలుగు ఎలక్ట్రికల్ చెత్త సేకరణ వాహనాలను మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీకి అందచేశారు. ఈ వాహనాలను మున్సిపల్‌కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.

## శ్రీఅభయాంజనేయస్వామికి ఆకుపూజలు

**అమడగూరు. ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని ఏ.కొత్తపల్లి బొబ్బిలికోట గ్రామంలో వెలసిన శ్రీఅభయాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం సందర్భంగా అమడగూరు గ్రామస్తులు, ఏ.కొత్తపల్లి గ్రామస్తులు స్వామివారికి ఆకుపూజలు కట్టించారు. ఉదయం స్వామివారికి అర్చకులు ప్రసాద్‌స్వామి పంచామృతాభిషేకాలు నిర్వహించి అనంతరం ప్రత్యేక పూజలు గావించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటాగుల్ల పూలు లక్ష్మీదేవి, కుటాగుల సురేష్, భార్గవి, యాలం ప్రకాష్, యాలం భారతి, వార్త రమణ కుటుంబసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఇప్పేరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం



పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

**కూడేరు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

కూడేరు మండలం ఇప్పేరు గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ పథకాలను గ్రామ రైతులకు తెలియజేశారు. అలాగే రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు విశిష్ట సంఖ్య నమోదు, రబి 2024-25లో వేసిన వేరుశనగ, వరి పంటలలో సమగ్ర సస్యరక్షణ రవి, వేసవి 2024-2025 వేరుశెనగలో సమగ్ర ఎరువుల యాజమాన్యాం కంది సాగు చేసిన రైతుల నుండి పంట సేకరణ, ఉద్యాన శాఖ ద్వారా ఎస్సీ టమోటా పంట సాగు వేసిన రైతులకు ఆర్థిక సమాయం, ఈపిఎంఐపి ద్వారా అందుతున్న సూక్ష్మ సేద్య యూనిట్ల మంజరీ, ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా అమలవుతున్న పశువుల షెడ్ల గురించి గ్రామ రైతులతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు డీలర్ శివ, ఆంజినేయులు, భీమన్న, ఎర్రిస్వామి, నగేష్, దాన్మిక, రమణ, సంగప్ప, మండల వ్యవసాయ అధికారి విజయకుమారి, ఎంపిఈఓ, శ్రీలత గ్రామ అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం

**నంబులపూలకుంట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం ధనియాన్ చెరువు, వంకమద్ది గ్రామాలలో సాగుచేసే వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి విలోకేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. సరైన ఎరువుల యాజమాన్యం వరిలో తప్పకుండా పాటించాలి, దుక్కిలోనే 200 కిలోల సూపర్, 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాస్, 20 కిలోల జింక్ సల్ఫేట్ తప్పనిసరిగా వేయాలి. అలాగే కలుపు తర్వాత 30 నుంచి 40 రోజుల మధ్య కాలంలో యూరియా 50 కిలోలు, పొటాష్ 25 కిలోలు తప్పనిసరిగా చల్లుకోవాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి 13-0-45 5 గ్రాములు/లీటర్, చిలేటెడ్ జింక్ రెండు గ్రాములు/లీటర్ కలిపి పిచికారి చేసుకోవాలి. అలాగే బ్యాక్టీరియా బ్లైట్ (ఆకు ఎండు తెగులు) ఉన్న చోట స్ట్రెప్టోమైసిన్ 40 గ్రాములు, టెట్రా సైక్లిన్ 40 గ్రాములు ఎకరానికి కలిపి పిచికారి చేసుకోవాలి. కొద్ది చోట్ల ఎర్రనల్లి ఉండటం గమనించామని, నివారణకై ఒమైట్ 1ఎం/లీటర్ పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే సాగు చేసే ప్రతి రైతు పచ్చి రొట్టె ఎరువులు వాడకం జీవన ఎరువులు వాడటం, కొనలు తుంచి నాటడం, కలిబాటలు వదులు కోవడం వంటి పద్దతులను తప్పనిసరిగా రైతులు పాటించవలెనని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వంకమద్ది గ్రామం రైతులు నరసింహులు, మౌలానాతోపాటు ఎంపిఈఓ సలీం పాల్గొన్నారు.

## డ్రైవర్ కు ఆర్థిక తోడ్పాటు



ఫోటో రైట్ అప్ డ్రైవర్ కు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం వైద్యం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

నరాల వ్యాధితో కాళ్లు చచ్చిబడిపోయి జీవనం గడపలేని స్థితిలో ఉన్న డ్రైవర్ కు సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో సూర్య నగర్ 80 ఫీట్ రోడ్డు నందు ఆటో స్టాండ్ వద్ద కనగానపల్లి మండలం మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ కు గత కొన్ని రోజుల నుంచి నరాల వ్యాధితో రెండు కాళ్లు చొచ్చుబడిపోయి జీవనాధారం చేసుకోలేని స్థితిలో తోటి డ్రైవర్ కు వైద్యం చేయించుకోవడానికి ఒక్క రూపాయి కార్యక్రమం ద్వారా 10 వేలు పోగుచేయడంతో పాటు అన్వర్ భాష , నారాయణస్వామి, సురేష్, మాబు, మల్లీరెడ్డి, విష్ణు ,సూరి మునిస్వామి వ్యక్తిగతంగా కలసి 5000 రూపాయలు కలపి మొత్తం రూ.15వేలు భాధితుడికి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్ వృత్తిలో పనిచేసుకుంటూ నరాల బలహీనతతో ఇలా జరగడం చాలా దురదృష్టకరమని చెప్పుకోవడానికి బాధగా ఉందని ఏదో కొద్ది వరకు వారి వంతు సహాయం చేస్తున్నామని దాతలు సహకరించి వారి వైద్య ఖర్చులకు అయ్యే వరకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. వారి ఫోన్ పే నెంబర్ కు 7416153998 వారికి నేరుగా మాట్లాడి అమోంట్ వేయవచ్చని కోరారు.

## వినియోగ దారుల పరిష్కార వేదిక విద్యుత్ అదాలత్



విద్యుత్ సమస్యను తెలుసుకుంటున్న మాజీ న్యాయమూర్తి సిఆర్ఎం జి.శ్రీనివాస ఆంజినేయ మూర్తి

**కదిరి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

విద్యుత్ వినియోగదారులకు పరిష్కార వేదిక అదాలత్ అని మాజీ న్యాయ మూర్తి పిఆర్ఎం జి.శ్రీనివాస్ ఆంజినేయమూర్తి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ ఎగ్జిక్యూట్ ఇంజినీర్ విద్యుత్‌కార్యాలయ ఆవరణంలో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ న్యాయమూర్తి జిఆర్ఎం జి.శ్రీనివాస్ ఆంజినేయమూర్తి మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా పరిష్కారం కాని విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వినియోగదారుల సమస్యలపరిష్కారం కోసం, వారి సౌకర్యాల కోసం విద్యుత్ అదాలత్ ఏర్పాటు చేశామన్నారు. ఈ పరిష్కార వేదికలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్లు, పాత స్తంబాల మార్పిడికై 15 ఫిర్యాదులు అందినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు కె.రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎల్.ఆంజిని కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.మోసెస్, టెక్నికల్ ఇంజినీర్ రమేష్‌బాబు, కదిరి పడమర, తూర్పు డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రధానం

**కదిరి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



బహుమతులు ప్రధానం చేస్తున్న బ్లూమూన్ విద్యా సంస్థల చైర్మన్ శివశంకర్

రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాలు, నివారణ గురించి కదిరి అప్‌గ్రేడ్ సిఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో బ్లూమూన్ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వపు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎస్.తమీమ్, వి.నిత్యశ్రీ, బిఎల్ఎస్ దీక్షితా రెడ్డి, జి.జగన్ మోహన్, ఆర్.ధృవి, జి.సాయి పూర్ణిమలకు బ్లూమూన్ విద్యా సంస్థల చైర్మన్ మంచి శివశంకర్ మంగళవారం పాఠశాల ఆవరణంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మాధవరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు రామాంజులు రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## టి సి వరుణ్ కు శుభాకాంక్షలు తెలిపిన పాములరాయి రఘు, మాజీ జెడ్పిటిసి వేణుగోపాల్



టి సి వరుణ్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు.

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, అవుడా చైర్మన్ టి సి వరుణ్ ను జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనంతపురం పార్లమెంటు సమన్వయకర్తగా నియమించిన సందర్భంగా మంగళవారం రూరల్ మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి పాము రాయి రఘు, రూరల్ మండలం మాజీ జెడ్పిటిసి వేణుగోపాల్, టిడిపి నాయకులు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అంద జేసీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనంతపురం జిల్లాలో తీసి వరుణ్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఆయనకు అవుడా చైర్మన్ పదవి ఇవ్వడంతో పాటు, అనంత జిల్లా పార్లమెంటు సమన్వయకర్త గా నియమించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## రైతులపై దురుసుగా ప్రవర్తిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

**తనకల్లు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

మండల పరిధిలోని కోటపల్లి గ్రామంలో రైతులపై అగ్రికల్చర్ అసిస్టెంట్ దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ సందర్భంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఆధార కార్డు పట్టా పాస్ బుక్ 1బి ఫోన్ నెంబర్ ఇవన్నీ కావాలని రైతులను చాలా ఇబ్బంది పెడుతున్నారు రోజు ఉదయం నుండి కోటపల్లి సచివాలయంలో రైతులు కూడునీలు లేకుండా అల్లాడుతున్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కాపలా కాస్తున్నారు రైతులుఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది తనకు కావలసిన వారికి ఇండ్ల దగ్గరకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కొంత మందిని చాలా ఇబ్బంది పెడుతున్నారు అంతేకాకుండా ఉలవలు ఇలాంటివి కూడా వారి కావాల్సిన వారికి ఇంటికి చేరుస్తున్నారని రైతులు ఎక్కడ చూసిన వాపోతున్నారు అగ్రికల్చర్ ఆఫీసర్లు గ్రామానికి వెళ్లి వాటిని పరిశీలించి అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు తెలిపారు వారిపై చర్య తీసుకోకపోతే కలెక్టర్ దగ్గరు దృష్టికి తీసుకు వెళ్తామని వారు అన్నారు.

## 28న ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

**అమడగూరు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

అమడగూరు మండల కేంద్రంలోని శ్రీచౌడేశ్వరి కళ్యాణమండపంలో ఈ నెల 28వతేదీన ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బిజెపి కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింత శరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, దక్షిణభారత ప్రకృతి వ్యవసాయ శిక్షణ నిపుణులు బసంపల్లి టి.నాగరాజు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. ఇందులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించే రైతులు, ఆరోగ్యరమైన ఆహారాన్ని కోరుకునే ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాజరైన వారికి చిరుధాన్యాలో రుచికరమైన విందు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ లైఫ్ స్కూల్ వ్యవస్థాపకులు మాస్టర్, నిర్వాహకులు ఇందుకూరు సురేందర్‌రెడ్డి, హరీష్‌కుమార్, పి.సురేంద్ర, రామకృష్ణ, శ్రీనివాసులు, రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సైన్స్ డే వేడుకలు

**- పరిశోధనలతోనే విద్యార్థుల్లో వైజ్ఞానిక ప్రగతి - డైరక్టర్ జయసింహారెడ్డి**



సైన్స్ పరికరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

స్థానిక రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆ పాఠశాల అకడమిక్ డైరక్టర్, ప్రిన్సిపాల్ జయసింహారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ డే వేడుకలను మంగళవారం ఘనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యుపి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డి విచ్చేశారు. విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ పరికరాలను ప్రదర్శినను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం శంకర్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు పుస్తకాల్లోని పాఠాల కంటే ప్రాక్టికల్‌గా విద్యను బోధిస్తే వారిలో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. ఆ విధంగా విద్యను భోదిస్తే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. అనంతరం డైరక్టర్ జయసింహారెడ్డి మాట్లాడుతూ...బాల్యం నుంచే విద్యార్థులకు పరిశోధనల ద్వారా విద్యను భోదిస్తే వారిలో వైజ్ఞానిక ప్రగతి పెంపొందుతుందని రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల అకడమిక్ డైరక్టర్, ప్రిన్సిపాల్ జయసింహారెడ్డి అన్నారు. అన్ని రంగాల్లో తమ విద్యార్థులను అగ్రగామిగా నిలపడే తమ ధ్యేయం అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా ప్రతాలు, జ్ఞాపికలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా టిఎన్‌టియుసి నిజాం జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నిజాం

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

టిఎన్‌టియుసి పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షుడు, మండల కోఅప్షన్ మాజీ సభ్యుడు షేక్ నిజాం వలి 55వ జన్మదిన వేడుకలను ఆయన మిత్రులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు అమడగూరు మండలం గాజులపల్లి వద్ద ఉన్న వృద్ధాశ్రమానికి వెళ్లి వృద్ధులు, కుటుంబ సభ్యుల, స్నేహితుల మద్య కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వృద్దులకు బట్టలు పంపిణీ చేసి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. హుండా ద్వారా పోగుచేసిన రూ 12270లను వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ షేక్ నిజాం సమాజ సేవలో తనవంతు సేవలను కొనసాగిస్తూ ప్రజల మనన్నలు పొందుతున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా ప్రతి యేటా వినాయకచవితి సందర్భంగా వినాయకునికి లడ్డూ సమర్పించడమే కాక తన స్వగ్రాం యం కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలోని శ్రీమణికంఠునికి మండలం రోజులకు సరిపడా పూజాసామాగ్రి సైతం అందిస్తూ తన ఉదారతను చాటుకుంటున్నాడని పలువురు ఆయన సేవానిరతిని కొనియాడారు. పదికాలాల పాటు ఆయన ఆయనకుటుంబ సభ్యులు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆశీస్సులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అమడగూరు ఎస్సై వెంకటనారాయణ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబుళరెడ్డి, ఎంపీటిసి శ్రీనివాసులు, టిఎన్‌టియుసి రామాంజులు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ సభ్యుడు జౌళి బాబా నాయకులు చాకివేల శ్రీనివాసులు, మీసేవ సుధాకర్, కుమార్ రాయల్, రంగారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, డిప్ప్రు నాగరాజు, టిఏలు ఆంజనేయులు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విశ్వేశ్వరరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువ



విశ్వేశ్వర రెడ్డిని సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

అనంత జిల్లా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డికి జెడ్పిటిసి చంద్రకుమార్, కామారుపల్లి మాజీ సర్పంచ్ మూలి లోక్నాథ్ రెడ్డి, యూత్ మాజి కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసులు, రూరల్ మండలం వైసిపి నాయకులు అమర్నాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మనోజ్, డాక్టర్ భాషా , కార్యకర్తలు మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండ మాజీ శాసనసభ్యులు విశ్వేశ్వర రెడ్డి పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు. విశ్వేశ్వర రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో జీవించాలని ఆ దేవున్ని కోరుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం వారు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు.

## శివరాత్రికి ముస్తాబైన శివాలయం

**యల్లనూరు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని కోటవీధిలో వెలసిన శివాలయాన్ని వివిధ రకాల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శివరాత్రి పండుగ సందర్భంగా బుధవారం ఉదయం పరమేశ్వరునికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు ఘనంగా నిర్వహించనున్నారు.



06ATP27_06ATP27.qxd 25-02-2025 PM 10:43 Page 1



# పిడి లక్ష్మినిధి లిమిటెడ్ కార్యాలయం ముందు డిపాజిటర్ల ఆందోళన..!

**-డిపాజిట్లు కట్టించుకొని రుణాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆవేదన -సిబ్బందిని నిలదీసి డిపాజిట్లు వెనక్కు ఇవ్వాలని పట్టుబట్టిన డిపాజిటర్లు -ఈనెల 17న ఛైర్మెన్‌పై తామే ఎస్పీకు పిర్యాదు చేశామన్న ఉద్యోగులు**



సిబ్బందిను నిలదీస్తున్న డిపాజిటర్లు

**ఉరవకొండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**




విలేఖరులతో మాట్లాడుతున్న డిపాజిటర్లు ముక్కన్న, ఈశ్వర్

పట్టణంలోని 10వ వార్డు పాత స్టేట్ బ్యాంకు భవనం ముందుగల పిడి లక్ష్మినిధి లిమిటెడ్ కార్యాలయం ముందు మంగళవారం పలువురు డిపాజిటర్లు ఆందోళనకు దిగారు. రుణాలు ఇస్తామంటూ తమతో డిపాజిట్లు కట్టించుకొని మూడు నెలలు కావస్తున్నా రుణాలు ఇవ్వకుండా, డిపాజిట్లు వెనక్కు ఇవ్వమన్నా పట్టించుకోకుండా మోసం చేస్తున్నారంటూ అక్కడి సిబ్బందితో వాగ్వివాదం చేశారు. ఈ సందర్భంగా విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామానికి చెందిన డిపాజిటర్లు ముక్కన్న, ఈశ్వర్ మాట్లాడుతూ 20వేల రూపాయలు డిపాజిట్ కడితే 45 రోజుల్లో వడ్డీ లేకుండా లక్ష రూపాయలు రుణం అందిస్తామని చెప్పిన మాటలు నమ్మి తాము డిపాజిట్లు చేశామని ఇప్పుడు మూడు నెలలు కావస్తుండగా రుణాలు ఇవ్వకపోగా మేము కట్టినడిపాజిట్లు వెనక్కుఇవ్వమన్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. మాతోపాటు అనేక మంది డిపాజిట్లు చేశారని అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నారు. ఈ విషయమై సదరు కంపెనీ ఇంచార్జ్ గోపాల్‌ను వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ ఈ బ్రాంచిలో 20 మంది వరకు డిపాజిట్లు కట్టగా 10 మందికు రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. డిపాజిటర్లు రుణాల కోసం ఒత్తిడి తెస్తుండగా కంపెనీ వ్యవస్థాపకులు పట్టించుకోకపోవడంతో మాతోపాటు జిల్లాలోని 8 బ్రాంచీలకు చెందిన సిబ్బంది అందరం ఈనెల 17వ తేదీన జిల్లా ఎస్పీను కలిసి పిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఉరవకొండ బ్రాంచి నుండి ఇదివరకే ఇచ్చిన రుణాలు రికవరీలు జరుగలేదని చెప్పారు.

# ప్రభుత్వాసుపత్రిను రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు

**-మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు మెరుగైన వైద్యం కోసం అదనపు వసతులు కల్పన-ఉరవకొండ ప్రభుత్వాసుపత్రి సందర్శనలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్**



ల్యాబ్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్

**ఉరవకొండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిను స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసి రాష్ట్రంలోనే మోడల్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలన్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు అందుకు తగట్టు చర్యలు చేపట్టడం జరుగుతోందని డీసీహెచ్‌ఎస్ (డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్) డాక్టర్ పాల్ రవికుమార్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని మంగళవారం ఆయన సందర్శించి వివిధ విభాగాలను తనిఖీచేసి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ



ఆసుపత్రి వైద్యులకు సూచనలు చేస్తున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్

సందర్భంగా తనను కలిసిన విలేఖరులతో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో మరిని న్న మౌళిక వసతులను కల్పించి వైద్యసేవలను మెరుగుపర్చడానికి అవసరమైనచర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ఇక్కడ గుండెజబ్బురోగులకోసం 5పడకలతో ఐసీయూ యూనిట్‌ను ప్రారంభించబోతున్నామని దీని నిర్వహణకు ఫిజీషియన్స్ వస్తారన్నారు. గుండె జబ్బు వచ్చిన వారి ప్రాణాలు పోకుండా ఇక్కడ విలువైన ఇంజక్షన్ అందించి ప్రాధమిక చికిత్స నిర్వహించిన అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కిడ్నీ రోగుల కోసం 5 పడకలతో డయాలసిస్ యూనిట్ అందుబాటులోకి తీసుకొని రాబోతున్నామని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు, సిబ్బందితోపాటు వారికి అవసరమైన పరికరాలను మెరుగుపర చ్చడం జరుగుతుందన్నారు. దాదాపు ఏడాదిలోపు మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో ఆసుపత్రి రూపురేఖలను మార్చి అభివృద్ధి చేయబోతున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వెంకటస్వామి చౌదరి, డాక్టర్ గంగాధర్ తదితరులు ఉన్నారు.

# ఆ సరస్వతి దీవెనలు మీపై మెండుగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల అధ్యక్షులు గోవిందప్ప

**అగళి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

కష్టపడి కాక ఇష్టపడి చదవాలని కెజిఎ గుప్తా కళాశాల అధ్యక్షులు గోవిందప్ప అన్నారు. సంవత్సరం పొడవునా చదివిన విద్యార్థులకు పరీక్షలో ఆసరస్వతిదేవి ఆశీస్సులు మెండుగాఉండాలని కోరుకున్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థుల సరస్వతి పూజ కర్యాక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎంతో కష్టపడి మారుమూల ప్రాంతంలో పేద విద్యార్థుల కోసం కళాశాలను, పాఠశాలను దివంగత కెజిఎ గుప్తా నిర్మించారని, శిష్యులుగా తాము అదే ఒరవడిని కొనసాగిస్తామన్నారు. విద్యార్థులు సరస్వతి పూజ సందర్భంగా తమకు తోచిన విషయాలను ప్రసంగించారు. ముఖ్యంగా పరీక్షల ప్రాధాన్యతను వివరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి శ్రీనివాస్, కర్ణాటక బ్యాంక్ మేనేజర్ శ్రీహరికిషోర్, సీనియర్ ట్రస్టీ కల్లప్ప, కరస్పాండెంట్ హనుమంతరాయప్ప, కోఆర్డినేటర్ శివప్ప, ట్రస్టీలు రంగనాతప్ప, అక్బర్ అలీఖాన్, ప్రిన్సిపాల్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి బడ్జెట్లో 30శాతం నిధులుకేటాయించాలి...!

**ధర్మవరం,ఫిబ్రవరి25,ప్రభాతవార్త**



మాట్లాడుతున్న పీఎస్ఈయూ జాతీయ కార్యదర్శి మహమ్మద్ పీవుల్లా

విద్యారంగానికి బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించాలని పీఎస్ యూ జాతీయ కార్యదర్శి మహమ్మద్ పీవుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రగతిశీల విద్యార్తిసంఘం రాష్ట్ర మూడవ మహాసభలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం సర్కిల్ నుంచి ఎన్జీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహాసభలో ఆయన మాట్లాడారు...కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేశాయన్నారు. విద్యాసంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న ఇంతవరకు విద్యార్థులకు అందాల్సిన తల్లికి వందనం స్కాలర్షిప్, ఫీజు రీఎంబర్స్మెంట్, హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పూర్తి స్థారు లో అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రం తెచ్చిన నూతన జాతీయ విద్యావిదానం వల్ల ప్రభుత్వ విద్యపూర్తిగా సర్వనాశనం అయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ ఏమూలకు సరిపోదన్నారు.వెనుకబడి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాది అవకాశాలు కల్పించాలని డిమాండ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకీరాములు, పీఎస్ యూ రాష్ట్రఅధ్యక్షులు మంజుల నరేంద్ర,ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పీఎస్యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, నాయకులు చంద్రనరసింహా, నందకిశోర్, సురేశ్, బాస్కర్, అయ్యన్న, చైతన్య, కేశవ పాల్గొన్నారు.

# డీలర్లు ,ఎండిఎం ఆపరేటర్లు సమన్వయంతో పని చేయండి

**సిఎస్‌డిటి నవీన్ కుమార్**

**అమరాపురం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



డీలర్ల సమావేశం దృశ్యం

మండల కేంద్రంలోని తహాసిల్దార్ కార్యాలయం నందు మంగళవారం సి ఎస్ డి టి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మండల డీలర్ల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం నందు మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు బంగారుపాళ్యం తిప్పేస్వామి, మండల డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్డిటి మాట్లాడుతూ ప్రస్తుతం మండల వ్యాప్తంగా 5వేలమంది దాకా రేషన్ తీసుకొనే లబ్ధిదారులు ఈకేవైసీని చేసుకోలేదని మూడు రోజుల్లోపు డీలర్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి డీలర్ స్టాక్ పాయింట్ గోడౌన్ వద్దకు వెళ్లి తమకు నిత్యవసర సరుకులను తీసుకొని రావాలని తెలిపారు. స్టాక్ తక్కువ వచ్చిందని ప్రజలకు ఎట్టి పరిస్థితిలోనూ ఇబ్బంది కలిగించకూడదని ఆయన పిలుపునిచ్చారు. డీలర్లు మాట్లాడుతూ తమకు ప్రతినెల బియ్యంతో పాటు చక్కెర బేళ్లు అందించే విధంగా చొరవ తీసుకోవాలని ముఖ్యంగా తమకు గ్రామాల వారీగా లారీల ద్వారా రేషన్ను నింపేందుకు కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలోనూ ఆయా పంచాయతీల డీలర్లకు సంబంధించిన సరుకులను అన్లోడ్ చేసే విధంగా చొరవ తీసుకోవాలని వారు కోరారు. కొత్త ఈపాస్ మిషన్లో అందించాలని డీలర్లు కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని డీలర్లు జయన్న,శకునప్ప,ఉమేష్ ,దాదాపీర్ ,రమేష్,రఘు,గౌడ,ఓంకార్ తదితరులుపాల్గొన్నారు.

# తండా గ్రామాలలో నాటు సారా పై అవగాహన సదస్సు



ప్రజలకు నాటు సారా పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి, 25(ప్రభాతవార్త**

మండల పరిధిలోని, గంగినేపల్లి, పంచాయతీ,ఎగువ తాండ,దిగువ తాండ, గ్రామాల్లో, మంగళవారం, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్, ఇన్స్పెక్టర్,ఎం. ఫరూక్ ఆజాం, సబ్ ఇన్స్పెక్టర్, వి.శివప్రసాద్, ఆధ్వర్యంలో నవోదయం 2.0 భాగంగా నాటు సారాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల్లో నాటు సారా తయారీ కి పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు,ఈ సదస్సులో ప్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిబ్బంది గ్రామానికి చెందిన వీఆర్వో, గ్రామ పెద్దలు, రాజకీయ ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

**బత్తలపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



శివరాత్రికి ముస్తాబైన బత్తలపల్లిలోని శివాలయం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు శివాలయాలతో పాటు మిగిలిన దేవాలయాలు అందంగా ముస్తాబయ్యాయి. మండలంలోని బత్తలపల్లి శ్రీ లలిత త్రిపుర సుందరి సమేత ఓంకారేశ్వరాలయం, ముస్టూరు, పోట్లమర్రి, సంగమేశ్వర క్షేత్రంలోని శివాలయాలు, సంజీపురం కాటి కోటేశ్వర క్షేత్రం, ఘంటాపురం అప్ప స్వామిదేవాలయం,దంపెట్ల చెన్నకేశవాలయం, డిచెర్లపల్లి సిద్దేశ్వరాలయం, రామాపురం మాల్యవంతం వీరనారాయణ స్వామి ఆలయాలతోపాటు వివిధగ్రామాలలోని దేవాలయాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు బుధవారం రాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వాములవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శివరాత్రి సందర్భంగా జాగారం చేసే భక్తుల కోసం గ్రామాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాములకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించేందుకు వేద పండితులు ఏర్పాట్లు చేశారు. గురువారం రామాపురం వీరనారాయణ స్వామికి చిత్రావతి నదిలో గంగపూజ, పరుస నిర్వహించి, భవిష్యవాణి వినిపించేందుకు గుడి పూజారులు సిద్ధం చేశారు. శివరాత్రి సందర్భంగా మండలంలో ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ప్రభాకర్ నేతృత్వంలో ఎస్సై సోమశేఖర్ అన్ని ఏర్పాట్లు చేశారు.

# పేకాట రాయుళ్లు అరెస్ట్

**7000 రూపాయలు నగదు స్వాధీనం**

**గుడిబండ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

గుడిబండ గ్రామ శివారులో బహిరంగ ప్రదేశంలో కొంతమంది కూర్చుని డబ్బులను ఫణంగా పెట్టి జూదం ఆడుతుండగా పోలీసులు అరెస్టు చేశారు ఈ సందర్భంగా ఎస్ఐ రాజ్ కుళ్ళాయప్ప మాట్లాడుతూ మాకు అందిన పక్కా సమాచారంతో తన సిబ్బందితో వెళ్లి జూదరులపై దాడిచేసి జమ్మల బండ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని అలాగే వారి వద్ద నుండి 7వేల రూపాయలు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# సోషల్ ఆడిట్లో బట్టబయలైన ఉపాధి హామీ పనుల అవినీతి

**ఉపాధి హామీ పథకం పనుల్లో రూ,172676.. రికవరీకి ఆదేశించిన ఏపిడి**

**ధర్మవరం రూరల్ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



సోషల్ ఆడిట్ తనిఖీ నిర్వహిస్తున్న సామాజిక బృందం

ధర్మవరం మండల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలపై సోషల్ ఆడిట్లో సామాజిక తనిఖీ బృందం నిగ్గు తేల్చింది. ఇందులో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏపీడి విజయేంద్రప్రసాద్ అధ్యక్షతన సోషల్ ఆడిట్ ప్రజా వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందం సభ్యులు ఉపాధి పనుల్లో జరిగిన అవినీతి తంతును ప్రజావేదికలో ఉన్న అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రాజెక్ట్‌డైరెక్టర్ విజయప్రసాద్, క్లస్టర్ఎపిడి చలపతి, అంబుడ్స్‌మెన్ శివారెడ్డి ఎంపిడిఓకార్యాలయం ఏవోనబీ ఏపీవో అనిల్‌కుమార్‌రెడ్డి, ఎస్ఆర్పి చంద్రమోహన్ ఉపాధి హామీ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మరియు తనిఖీబృందం సభ్యులు పాల్గొన్నారు. కాగా ప్రజావేదికలో పంచాయతీ వారిగా నివేదికలను తనిఖీ బృందం చదివి వినిపించగా ప్రిసైడింగ్ అధికారి అయిన పీడీ, అంశాల వారిగా వాటిని పరిశీలించి 20 పంచాయతీలలోని రికవరీ చేయాల్సిన మొత్తం 172676 రూపాయలుగా నిగ్గుతేల్చడం జరిగింది ఇందులో ఏఈఎస్ఎస్ఏ వారి రికవరీ 2000/ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ వారిది 51320 మిగిలిన మొత్తము 119356/ రూపాయలు ఉపాధిహామీ సిబ్బంది ఒక దోమ పట్టించినట్లుగా ప్రజావేదికలో బట్టబయలు చేశారు. ఈ సందర్భంలో ఏపీ డి మాట్లాడుతూ సాధ్యమైనంత తొందరగా ఉపాధిహామీ పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని అంతేగాక ఈమొత్తం సొమ్ము రికవరీచేయాల్సిందిగా సంబంధితఅధికారులను ఆయన ఆదేశించారు.

# చెత్త సంపదపై అవగాహన

**రామగిరి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



అవగాహన కల్పిస్తున్న డిఎల్‌పిఓ శివకుమార్

మండలంలోని పేరూరులో చెత్త సంపదపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. డీఎల్‌డిఓ శివకుంవారి ఆకస్మికంగా పేరూరు గ్రామ పంచాయితీ కేంద్రాన్నితనిఖీ చేశారు. అనంతరం ఆమె చెత్తపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యానిమేటర్లు, గ్రీన్ అంబాసిడర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఎల్‌డిఓ మాట్లాడుతూ.. చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని ఏ విధంగా తయారు చేసుకోవాలో తెలియజేశారు. చెత్తలో పొడి, తడి చెత్తను వేరువేరుగా చేయడం ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లను చెత్తలో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెత్తలో ప్లాస్టిక్ కవర్లు వేయడం వల్ల అందులో అరటితొక్కలు, కూరగాయలు ఉండటంతో పశువులు కవర్లతో వాటిని తినడం వల్ల మృత్యువాత పడుతున్నాయన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి కమలాబాయి, పంచాయితీ కార్యదర్శి సత్యమ్మ పాల్గొన్నారు.

# 70 ఏళ్లుగా నష్టపోతున్నాము..ఆంధ్రాలో వాల్మీకులకు ఒకే రిజర్వేషన్ కావాలి

**-వాల్మీకులకు ఎస్‌టి రిజర్వేషన్ కల్పించండి..రాష్ట్ర అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ డిమాండ్ -రాష్ట్ర విద్య, వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కలిసి వినతి**

**గోరంట్ల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందచేస్తున్న లక్ష్మినారాయణ

ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు రాష్ట్రంలో వాల్మీకులకు ఎస్‌టి రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్రంలో వాల్మీకులకు రెండు రిజర్వేషన్లు అమలవుతున్నాయని దేశవ్యాప్తంగా వాల్మీకులు ఎస్‌టిలో వుంటే ఆంధ్రప్రదేశ్‌లో బిసిలుగా వున్నారని రాష్ట్ర మంత్రి వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి గోరంట్లకు చెందిన వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ తీసుకెళ్లి వినతపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతాపార్టీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్‌తో కలిసి విజయవాడలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వున్న వాల్మీకి సమాజం రెండు రిజర్వేషన్లుగా కొనసాగుతున్నారని 5 జిల్లాల్లో ఎస్‌టిలుగా వున్నారని మరో 8 జిల్లాల్లో బిసిలుగా కొనసాగుతున్నారన్నారు. ఒకే రాష్ట్రంలో ఒకే కులంలో రెండు రిజర్వేషన్లు కొనసాగడం దేశంలో ఎక్కడ కూడా లేదని ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే వాల్మీకి సమాజం రెండు రిజర్వేషన్లు కొనసాగుతున్నాయన్నారు. అఫీషియల్ రికార్డు ప్రకారం వాల్మీకి సమాజం 1871 నుండి 1956 వరకు ఎస్‌సి రిజర్వేషన్‌లో వున్నా 1956 తరువాత వాల్మీకి సమాజాన్ని రెండు రిజర్వేషన్లుగా చేయడం జరిగిందని దీని వల్ల వాల్మీకి జాతికి తీవ్రంగా నష్టం వాటిల్లిందని, 70 సంవత్సరాలుపైగా వాల్మీకి రిజర్వేషన్ సంబంధించిన విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయం అన్ని రకాలుగా వాల్మీకి సమాజం నష్టపోయి దీన స్థితిలో వున్నారన్నారు. దేశవ్యాప్తంగా వాల్మీకి సమాజం ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్‌లో వున్నారని వాల్మీకి సమాజంపై దయ వుంచి తమ రిజర్వేషన్ పునరుద్దరణ అయ్యే విధంగా చట్ట సభ లోక్‌సభలో కానీ, రాజ్యసభలో కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వం దృష్టికి వాల్మీకి రిజర్వేషన్ ప్రస్తావన తీసుకొచ్చి చట్టసభల్లో చట్ట బద్ధత అయ్యే విధంగా కృషి చేయాలని లక్ష్మినారాయణ కోరారు.

# చౌక దుకాణాల్లో సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

**సివిల్ సప్లై డిటి నవీన్ కుమార్**

**గుడిబండ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని తహశిల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశిల్దార్ నవీన్ కుమార్, డిప్యూటీ తహశిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి కలిసి డీలర్లు,ఎండియు ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ డిటి నవీన్ కుమార్ మాట్లాడుతూ డీలర్లు,ఎండియు ఆపరేటర్లు ఒకటవ తేదీన రేషన్ కార్డుదారులకు సరుకులు సకాలంలో సక్రమంగా పంపిణీ చేయాలని,తూకాలలో మోసం లేకుండా పంపిణీ చేయాలని అలాగే యండియు ఆపరేటర్లు, డీలర్లు లబ్దిదారులకు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీలర్లు,ఎండియు ఆపరేటర్లు వీఆర్వో రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ కుమార్

# పిడిఎస్ వస్తువులను సకాలంలో కార్డుదారులకు పంపిణీ చేయాలి

**జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్**

**పుట్టపర్తి (కలెక్టరేట్), ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

పిడిఎస్ వస్తువులను సకాలంలో కార్డుదారులకు పంపిణీ చేయాలి అని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని కోర్టు హాలు నందు ధరల పర్యవేక్షణ మరియు నియంత్రణ కమిటీ , సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతు బజార్ల ద్వారా, 34 ప్రత్యేక కౌంటర్లు తెరిచి నిత్యవసర వస్తువులు, నూనెలను విక్రయించాలని ఆదేశించారు. ప్రత్యేక కౌంటర్లలో కంది పప్పును విక్రయించే అవకాశాలను తనిఖీ చేయడానికి హోర్డింగ్ పాయింట్ల ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్ని మార్కెట్లలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ద్వారా అమలు చేస్తున్నారా లేదా అన్న వివరాలను లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్లు నివేదికలను తయారుచేసి జాయింట్ కలెక్టర్ కు పంపవలసిందిగా ఆదేశించారు. అన్ని ప్రభుత్వ చౌక ధర దుకాణాలలో బరువులు మరియు కొలతలను తనిఖీ చేయవలసిందిగా ఆదేశించారు. నిత్యవసర వస్తువుల ధరలు అకస్మాతూగా పేరిగిపోకుండా ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు వంశీకృష్ణారెడ్డి, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 3 న కలెక్టరేట్లో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు**

**తాడిమర్రి ఫిబ్రవరి 25 ( ప్రభాతవార్త)**



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు

దారిద్రరేఖకు దిగవనున్న నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం ఇల్లు లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3, సెంట్లు పట్టణ ప్రాంతాల్లో 2,సెంట్లు స్థలాన్ని కేటాయించి వారికి ఇల్లు నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఎం అగ్రహారం గ్రామంలో మండల కార్మిక సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ అధ్యక్షతన మండలంలో సొంత ఇల్లు లేని నిరుపేదలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ముసుగు మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు గృహ నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం గ్రామాల్లో ఒకటిన్నర సెంటు పట్టణాల్లో సెంటు 1,80,000 గృహ నిర్మాణం కోసం ఇచ్చిన మొత్తంఎందుకు సరిపోలేదని ఆవేదన చెందారు. పేదల సొంతింటి కల సాకారం కోసం మార్చి 3,వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో నిర్వహించే ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు దాసు, బత్తలపల్లి మండల వ్యవసాయకార్మిక సంఘం కార్యదర్శి నాగభూషణ ఆర్గనైజింగ్ కార్యదర్శి సన్న పెద్దన్న చౌడప్ప, వసురప్ప , నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి కిరణ్**

**కనగానపల్లి ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



ప్రిన్సిపాల్ రవి కిరణ్

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ నందు మంగళవారం ప్రిన్సిపల్ రవి కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు 2025 2026 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి చేరేందుకు విద్యార్థిని, విద్యార్థులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓసి, బిసి విద్యార్థులకు 150 రూపాయలు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 75 రూపాయలు పరీక్షా రుసుము చెల్లించి ఈనెల 31 తేదీలోగా ఆన్లైన్ నందు దరఖాస్తు నమోదు చేసుకోవాలని ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవికిరణ్ తెలిపారు .మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ను సంప్రదించాలని ఆయన కోరారు.

# వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

**-ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తల మరమ్మతులకు రూ.30 లక్షలు మంజూరు -ఉద్యోగులు, వినియోగదారుల ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు -ప్రభాతవార్తతో విద్యుత్ ఏడిఇ నాగేంద్ర**

**గుంతకల్లు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏడిఇ నాగేంద్ర

వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తామని ట్రాన్స్‌కో ఏడిఇ నాగేంద్ర అన్నారు. ఆలూరు రోడ్డులో వున్న విద్యుత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. డి-1, డి-2 సెక్షన్ల పరిధిలో పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో దాదాపు 180 ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తలు వీక్ అయినట్లుగా గుర్తించామన్నారు. జూనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ లైన్‌మెన్‌తో పాటు ఫోర్‌మెన్లను కూడా భాగస్వాములను చేసి సంబంధిత ప్రాంతాల ట్రాన్స్‌ఫార్మర్లను స్వయంగా పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. ఎర్తల మరమ్మతుల నిమిత్తం దాదాపు 30 లక్షలు మంజూరయ్యాయని మార్చి నెలలో పనులను ప్రారంభిస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఓవర్ లోడ్, లైన్ల మీద చెట్లు పడడం, లూజు లైన్ల కారణాల వల్ల ఎర్తలు వీక్ కావడం జరుగుతుందన్నారు. అలాగే లో ఓల్టేజి వున్న చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా సిబ్బంది, వినియోగదారుల ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఏడిఇ తెలిపారు. ఔ

# శ్రీలక్ష్మీ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు

**గుడిబండ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

మండల పరిధిలోని పియన్ పాళ్యం గ్రామానికి చెందిన శంకరగల్లు జానకల్లు కులస్తులు బడమారనహళ్ళి శ్రీ లక్ష్మీ రంగనాథస్వామికి ప్రత్యేక అలంకరణలతో పూజలు నిర్వహించారు.తదనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు

**-శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ దంపతులు**



మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికు బొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి

**ఉరవకొండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రం అనంతపురంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఉరవకొండ జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి దంపతులు వారి తనయుడు ఏ.సి.పవన్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికు పూల బొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంతోపాటు జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మాజీ ఎమ్మెల్యేను పూలమాలలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా షటిల్ టోర్నమెంట్

**-ఎస్.కె.ఆర్ క్లబ్ ఉపాధ్యక్షులు ఎం.ఎర్రిస్వామినాయుడు, కార్యదర్శి సి.రవీంద్రనాథ్**

**ఉరవకొండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

ఉరవకొండ గవిమఠ సంస్థానంలో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మార్చి 8, 9, 10 తేదీల్లో షటిల్ టోర్నమెంట్‌ను క్లబ్ ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు పట్టణంలోని ఎస్.కె.రిక్రియేషన్ క్లబ్ ఉపాధ్యక్షులు ఎం.ఎర్రిస్వామినాయుడు, కార్యదర్శి సి.రవీంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు కర్నాటక రాష్ట్రం బళ్లారి ప్రాంత క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. క్రీడాకారులు తమ, తమ జోడి యొక్క ఆధార్ కార్డులతోపాటు ప్రవేశ రుసుం 500 రూపాయలను సి.రవీంద్రనాథ్ మొబైల్ నంబర్: 94925 54774, కె.శ్యామ్‌రావు మొబైల్ నంబర్: 99086 25717, ఎ.గోపాల్ మొబైల్ నంబర్: 98669 24490కు చెల్లించి మార్చి 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నమోదు చేసుకోవాలన్నారు. ఈ షటిల్ టోర్నమెంటులో గెలిచిన జోడికు మొదటి బహుమతిగా 15,116 రూపాయలు, ద్వితీయ బహుమతిగా 10,116 రూపాయలు నగదుతోపాటు ఉత్తమ క్రీడాకారునికి ప్రోత్సాహక బహుమతిని అందించడం జరుగుతుందని వారు వివరించారు.

## విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**-అవగాహన కార్యక్రమంలో ఏడీఏ పద్మజ, ఏవో శుభకర్**

**ఉరవకొండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ పద్మజ. చిత్రంలో ఏవో శుభకర్ ఉన్నారు

విశిష్ట గుర్తింపు సంఖ్య పొందిన రైతులకు మాత్రమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందని ఏడీఏ పద్మజ, ఏవో శుభకర్ తెలిపారు. మండల పరిధిలోని రాయంపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై రాయంపల్లి, వ్యాసాపురం గ్రామాల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ, ఏవో మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట ప్రతి రైతుకు నిర్దిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చే ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. సొంత భూమి కల్గిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్ ఉన్న మొబైల్, పట్టాదారు పాసుపుస్తకంతో సంప్రదించాలని సూచించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతుల సమక్షంలోనే ఈ విశిష్ట సంఖ్య కోసం కంప్యూటర్‌లో వివరాలు నమోదు చేస్తారని వెంటనే మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుందని ఆ ఓటీపీను సిబ్బందికి తెలియజేస్తే నమోదు ప్రక్రియ పూర్తీఅయి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారన్నారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓబుల్‌రెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది మీనాక్షి, వన్నప్ప రాయంపల్లి, వ్యాసాపురం రైతులు పాల్గొన్నారు.

## 27న ఉరవకొండ, కణేకల్లు, విడపనకల్లు మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**-విద్యుత్‌శాఖ ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ డి.భాస్కర్**


**ఉరవకొండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**


విద్యుత్‌శాఖ ఉరవకొండ డివిజన్ పరిధిలోని ఉరవకొండ, కణేకల్లు, విడపనకల్లు మండలాల్లో ఈనెల 27వ తేదీన గురువారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ ఫీజర్‌కు మరమ్మతులు నిర్వహించాల్సి ఉండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసౌకర్యాన్ని గమనించి ప్రజలు సహకరించాలని డీఈఈ కోరారు.

## అనారోగ్యంతో కౌకుంట్ల టీడీపీ ఎంపీటీసీ కురుబ శ్రీనివాసులు మృతి

**-నివాళులర్పించిన ఉరవకొండ ఎంపీడీవో బి.వి.రవికుమార్**

**ఉరవకొండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**





అనారోగ్యంతో మృతి చెందిన కౌకుంట్ల ఎంపీటీసీ కురుబ శ్రీనివాసులు, కురుబ శ్రీనివాసులు (ఫైల్‌ఫోటో)

మండల పరిధిలోని పెద్దకౌకుంట్ల-1 తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ సభ్యుడు కురుబ శ్రీనివాసులు (43) అనారోగ్యంతో మృతి చెందాడు. కామెర్ల వ్యాధితో బాధపడుతూ గత మూడు రోజులుగా అనంతపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. మృతునికి భార్య భూలక్ష్మి, కొడుకు ఆదర్శ్, కుమార్తె అర్చన ఉన్నారు. వ్యవసాయం ద్వారా జీవనం సాగిస్తున్న ఆయన మంచి వ్యక్తిత్వం కల్గిన వ్యక్తిని పలువురు అన్నారు. కురుబ శ్రీనివాసులు భౌతిక కాయాన్ని ఎంపీడీవో బి.వి.రవికుమార్ సందర్శించి పూల మాలవేసి నివాళులర్పించారు. కురుబ శ్రీనివాసులు అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితుల అశ్రునయనాల మధ్య స్వగ్రామంలో జరిగాయి.

## ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్.

**ధర్మవరం, ఫిబ్రవరి25,ప్రభాతవార్త**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్ ను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. మంగళవారం ధర్మవరం మార్కెట్ యార్డు నందు ఈవిఎం యంత్రాలు, వివిప్యాట్ లు భద్రపరిచిన గోడౌన్ ను తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవిఎం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. అనంతరం సెక్యూరిటీ లాగ్ బుక్ ను పరిశీలించి అందులో సంతకం చేశారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ తనిఖీ జరిగింది. జిల్లా కలెక్టర్ వెంట ధర్మవరం ఆర్డీవో మహేష్, ధర్మవరం ఎమ్మార్వో , నటరాజ్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి చైతన్య, బీఎస్పీ పార్టీ ప్రతినిధి ఆంజనేయులు, టిడిపి పార్టీ ఫక్రుద్దీన్, బిజెపి పార్టీ ప్రతినిధులు, ఈశ్వర నాయక్, నాగభూషణం, గోవింద్, రాంగోపాల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు వక్క, చింతచెట్లు కాలిన వైనం

**అగళి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



చింత చెట్లు కాలిన దృశ్యం

మండల పరిధిలోని దొక్కలపల్లికి చెందిన దాసప్ప అనే రైతుకు సంబంధించి వక్క, చింత చెట్లు ప్రమాద వశాత్తు అగ్నికి కాలి బూడిద య్యాయి. ఎంతో కష్టపడి కన్నబిడ్డలా పెంచిన వక్క చెట్లు కళ్లముందే కాలుతుంటే అతని మనస్సు సతరుక్కుపోయింది. కన్నీటి పర్యంతమయ్యారు. పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

## జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు పూర్తి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓలు, అంగన్‌వాడీ టీచర్లు

**అగళి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

అగళి ఉన్నత పాఠశాలలో గత ఐదు రోజులుగా అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి కార్యక్రమాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణలో మెలుకువలను తెలుసుకుని ఎలా బోధించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో మండలంలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు అందరూ పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో ఎంఈఓలు భాస్కర్, చంద్రశేఖర్‌నాయుడు, హెచ్ఎం వరదరాజులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి, ఆర్‌పిలు కార్తిక్, వలి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ కింద పడి యువకుడి దుర్మరణం...!



వినోద్ కుమార్ (ఫైల్ ఫోటో)ఫోటో




ప్రమాదానికి కారణమైన టిప్పర్

**ధర్మవరం,ఫిబ్రవరి25, ప్రభాతవార్త**

ధర్మవరంలో టిప్పర్ కిందపడి ఓ యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని శాంతినగర్కు చెందిన పెద్ద పోతలయ్య, అరుణ దంపతులకు కుమార్తె మాదవి, కుమారుడు వినోద్ కుమార్(20) ఉన్నారు. వినోద్ కుమార్ 10వతరగతి వరకు చదువుకున్నాడు.అయితే తండ్రిపోతలయ్య బార్బర్ షాప్ నిర్వహిస్తున్నాడు. కుమారుడు వినోద్ కుమార్ కూడా నాయిబ్రాహ్మణవృత్తి చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో సిమెంట్ ఇటుకల లోడుతో టిప్పర్ బత్తలపల్లి వైపు నుంచి ధర్మవరం పట్టణంలోకి వెల్తోంది. అయితే టిప్పర్ కదిరి గేటు వద్దకు రాగానే అక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు జరుతున్న నేపథ్యంలో వన్ వే ఉండటంతో వినోద్ కుమార్ ద్విచక్రవాహనంలో టిప్పర్ ను దాటుకుని వెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో పక్కనే ఉన్న బురదగుంటలో ద్విచక్రవాహనం జారడంతో టిప్పర్ కిందపడ్డాడు. దీంతో వినోద్ కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి తల్లిదండ్రుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఉన్నఒకగానొక్క కుమారుడు మృతిచెందడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు.

## కళాశాల అభివృద్ధికి చేయూతనందిస్తాం

**- కర్ణాటక బ్యాంకు మేనేజర్ శ్రీహరికిషోర్**



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ శ్రీహరికిషోర్

**అగళి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

కెజిఎ గుప్తా కళాశాలను పేద విద్యార్థుల కోసం 1997 సంవత్సరంలో దివంగత కెజిఎ గుప్తా నిర్మించారని కర్ణాటక బ్యాంకు మేనేజర్ శ్రీహరికిషోర్ అన్నారు. సరస్వతి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేనేజర్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాకు సుదూర ప్రాంతంలో ఉన్న మారుమూల, ఒక పక్క విసిరేసినట్లు ఉండే మండలంలో దాదాపు 25 సంవత్సరాల క్రితం కళాశాల నిర్మించాలన్న తపన, ఆలోచన దివంగత కెజిఎ గుప్తాకు వచ్చిందని వారి పెన్షన్ డబ్బులతోపాటు వారి వద్ద చదివిన శిష్యులు వివిధ పదవుల్లో ఉన్నారు. వారితో చేతనైనంత సేకరించి జూనియర్ డిగ్రీ కళాశాలతోపాటు పాఠశాలను ఏర్పాటు చేశారు. తక్కువ ఫీజులతో విద్యాబోధన చేస్తున్నారని, సేవా దృక్పతంతో ఈ కళాశాలను స్థాపించారని, అందుకు కర్ణాటక బ్యాంకు సేవా తరపున విద్యార్థులకు అవసరమైన తాగునీటి వసతికి, కంప్యూటర్ల ఏర్పాటుకు తన శాఖ వారితో మాట్లాడి సహాయం అందిస్తామని మేనేజర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి శ్రీనివాస్, కర్ణాటక బ్యాంక్ మేనేజర్ శ్రీహరికిషోర్, సీనియర్ ట్రస్టీ కల్లప్ప, కరస్పాండెంట్ హనుమంతరాయప్ప, కోఆర్డినేటర్ శివప్ప, ట్రస్టీలు రంగనాతప్ప, అక్బర్ అలీఖాన్, ప్రిన్సిపాల్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## సంగమేశ్వరం వద్ద చిత్రావతి నదిలో మహా కుంభమేళా నీళ్ళు కలిపిన హైకోర్టు న్యాయవాది అంజన రెడ్డి.



చిత్రవతినిధిలో మహాకుంభమేళా నీటిని కలుపుతున్న హైకోర్టు న్యాయవాది అంజన రెడ్డి

**బత్తలపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

మండలంలోని సంగమేశ్వరం వద్ద చిత్రావతి నదిలో మంగళవారం మహా కుంభమేళా త్రివేణి సంగమం నుండి తెచ్చిన పవిత్ర జలాలను హైకోర్టు న్యాయవాది అంజన రెడ్డి ఆధ్వర్యంలో కలపడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్ రాజ్ నగరంలో పవిత్ర గంగా, యమునా, సరస్వతి నదులు కలిసే త్రివేణి సంగమంలో 144సంవత్సరాలకు ఒకసారి మహా కుంభమేళా నిర్వహించడం జరుగుతుంది. క్షీరసాగర మదన సమయంలో ఒక చుక్క అమృతం పడిన సమయంలో కుంభమేళా నిర్వహించడం పురాతన కాలం నుండి ఆనవాయితీగా వస్తున్నది అన్నారు. మహా కుంభమేళాలో పాల్గొని పవిత్ర త్రివేణి సంఘంలో స్థానం చేయడం జన్మజన్మల పుణ్యంగా హైందవ సమాజం భావిస్తుందన్నారు. మహా కుంభమేళాలో ఇప్పటికే దాదాపు 60 కోట్లమంది ప్రపంచ నలుమూలల నుండి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించినట్లు తెలిపారు. మహా కుంభమేళా రేపు జరిగే మహాశివరాత్రితో ముగియనున్నదని, ఇలాంటి పవిత్రమైన మహాకుంభమేళాలో పాల్గొని పుణ్య స్నానం ఆచరించలేని వారికోసం మహా కుంభమేళా జరిగే త్రివేణి సంగమం నుండి తీసుకుని వచ్చిన పుణ్య జలాలను హైకోర్టు న్యాయవాది, తెలుగుదేశం పార్టీ న్యాయ విభాగం రాష్ట్ర కోశాధికారి ఇ.అంజన రెడ్డి బత్తలపల్లి మండలంలోని సంగమేశ్వర క్షేత్రం వద్ద చిత్రావతి నదిలో కలపడం జరిగింది. ఈ సందర్భంగా ఇ.అంజన రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా సంఘమేశ్వరం పుణ్యక్షేత్రానికి పెద్ద ఎత్తున వచ్చే భక్తులు చిత్రావతి నదిలో స్నానమాచరించి శివునికి పూజలు చేస్తే మహాకుంభమేళాలో పుణ్య స్నానం ఆచరించిన ఫలితం దక్కేలా ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమం నుండి తెచ్చిన పుణ్య జలాలను సంగమేశ్వరం వద్ద చిత్రావతి నదిలో కలపడం జరిగిందన్నారు. వేద పండితులు మునిపల్లి జనార్ధన్ స్వామి, యస్వంత్ కుమార్, అశోక్ కుమార్ త్రివేణి సంగమం నీళ్ల కలిపిన చిత్రావతి నదిలో స్నానమాచరించిన మహా కుంభమేళాలో స్నానం చేసిన ఫలితం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మంజుల సురేష్, తెలుగుదేశం నాయకులు అక్కిం నరసింహులు, బెస్త శ్రీరాములు, తిప్పేపల్లికి చెందిన దాడితోట వెంకటేష్, సాకే లక్ష్మీనారాయణ, గుంటకల నాగభూషణ, గొట్లూరు ఆదిశేఖర్ రెడ్డి, సుధాకర్, గుంటి కృష్ణమూర్తి, నారాయణస్వామి, నల్లప్పలతో పాటు తిప్పేపల్లి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ముగిసిన అంగన్వాడి జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం



జ్ఞాన జ్యోతి మాడ్యూల్స్‌తో అంగన్వాడీ వర్కర్లు డిఆర్పీలు

**బత్తలపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

పిల్లలకు చిన్న వయసులోనే విద్యపై పునాది వేసేందుకు అంగన్వాడీ వర్కర్ ఇస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నేటితో ముగిసింది. ఈనెల 18 నుండి స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ నేతృత్వంలో డిఆర్పీలు నాగేశ్వరరావు, రామసుబ్బారెడ్డి, నాగేశులుఅంగన్వాడీ వర్కర్లకు ఆరు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో చిన్నారులకు విద్యలో అందించాల్సిన ఐదు డొమైన్స్ పైన ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చిన్నారుల్లో సమగ్రమైన అభివృద్ధి పెంపొందించడం లాంటి విషయాలను తెలియజేశారు. పిల్లలను పాఠశాలకు వెళ్లడానికి సిద్ధం చేయడం ద్వారా పునాదభ్యసనాన్ని బలోపేతం చేయడం జరుగుతుందని తెలియజేశారు. శిక్షణానంతరం జ్ఞాన జ్యోతి 120రోజుల సర్టిఫికెట్ కోర్స్ మొదటి సంవత్సరం మాడ్యూల్ పుస్తకాన్ని అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సిడిపిఓ సరస్వతి, ఎంఈఓలు సుధాకర్ నాయక్, చాముండేశ్వరులు పర్యవేక్షించారు.


## సంగమేశ్వరంలో స్వచ్ఛభారత్

**బత్తలపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

మండలంలోని అప్పరాచెరువు గ్రామం సంగమేశ్వర క్షేత్రంలో పంచాయతీ అధికారులు, నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఉత్సవాలు, పరుష కార్యక్రమాలకు సంగమేశ్వర క్షేత్రంలో స్వచ్ఛభారత్ కింద పరిసరాలు పరిశుభ్రం చేయించడంతోపాటు లైట్స్ చెకింగ్ చేశారు. బిజెపి మాజీ మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప, సర్పంచ్ శారదమ్మ భర్త సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ అనీల్ లు పారిశుద్ధ కార్మికులతో పనులు చేయించారు.

## కరోనా అడిషనల్ వర్కర్స్‌కు డైలీవేజ్ కింద రూ.15వేలు వేతనం ఇవ్వాలి...!

**ధర్మవరం,ఫిబ్రవరి 25,ప్రభాతవార్త**



మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం అందజేస్తున్న పారిశుద్యకార్మికులు

ధర్మవరంలో కరోనా కాలంలో అడిషనల్ వర్కర్స్‌కింద తక్కువ వేతనంతో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రూ.15వేలు జీతాలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికసంఘం నాయకులు కమిషనర్ ప్రమోద్కుమార్కు విన్నవించారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు బాబు, ముక్కుంద, లక్ష్మీఓబులేశులు శానిటరీ ఇన్స్పెక్టర్ శ్యామ్సన్ తో కలిసి కరోనా కాలం నుంచి పనిచేస్తున్న కార్మికుల సమస్యలను కమిషనర్కు వినతిపత్రం రూపంలో అం దజేశారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించి కచ్చితంగా అమలు చేసా మని హామీ ఇచ్చారు.

## పెట్రోల్ పోసుకుని బాలిక ఆత్మహత్య యత్నం

**అగళి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

మండల పరిధిలోని జంగమరపల్లి గ్రామానికి చెందిన అమూల్య(17) తన ఇంటి వద్ద పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. చుట్టుపక్కల వారు నిప్పంటించుకున్న దృశ్యాన్ని చూసి ఆర్పి వేయగా మెరుగైన చికిత్స కోసం కర్ణాటక రాష్ట్రం తుమకూరు ఆసుపత్రికి తరలించారు. దాదాపు 40 శాతం శరీరం కాలినట్లు తెలిసింది. అమూల్య మడకశిరకు చెందిన ఒక యువకుడితో ప్రేమ వ్యవహారాలు జరిపిందని, ఆ వ్యక్తితో వివాహం చేసుకోవడానికి ప్రయత్నించగా దాదాపు ఆ విషయం విఫలమైనట్లు తెలుస్తోంది. అమూల్య మైనర్ కావడంతో తండ్రి అమూల్య ఆచూకీ కోసం రెండు రోజులపాటు అక్కడక్కడ విచారించారు. చివరికి ఎలాగోఅలాగ ఇంటికి చేరిన అమూల్య విరక్తి చెంది పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. మెరుగైన చికిత్స ఆమెకు కొనసాగుతోంది.

## సిద్ధేశ్వర స్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే విశేష పూజలు



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మరియు నాయకులు దృశ్యం

**అమరాపురం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

మండలంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి సిద్దేశ్వర స్వామి దేవాలయం నందు మంగళవారం మడకశిర మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి విశేష పూజల్లోపాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం అర్చనలను ఆలయ అర్చకులు నిర్వహించి మాజీ ఎమ్మెల్యే కు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి విశిష్టతను వివరించారు. అన్నదానోహకేంద్రం నందు అన్నప్రసాదాన్ని స్వీకరించారు .కార్యక్రమంలో సర్పంచ్ తిప్పేస్వామి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్, శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి సీనియర్ వైకాపా నాయకులు పేలుబండ ప్రసాద్, ఆటో తిప్పయ్య,డీలర్ శివకుమార్, డీలర్ శివలింగప్ప,తిమ్మన్న మాజీవక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ గగన, చిక్కన్న, జెకె మూర్తి, శివలింగప్ప, సోమశేఖర్ గౌడ్, ఓబులేష్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజ్ఞాన భారతీయ విద్యార్థులు



ఆంధ్రప్రదేశ్ విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ లు

**బత్తలపల్లి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

ఐరా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ వారు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించబడిన అబాకస్ ప్రతిభా పరీక్షలలో మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి విద్యాలయం" విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచారు. మంగళవారం స్థానిక పాఠశాలలో పాఠశాల చైర్మన్ వెంకటకృష్ణ, కరస్పాండెంట్ కవితలు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో 5వ తరగతి విద్యార్థిని అశ్విత, ఆరవస్థానంలో 3వ తరగతి విద్యార్థి సాత్విక్ లు నిలిచారన్నారు. అదేవిధంగా 28 మంది విద్యార్థులు అబాకస్ అచీవర్స్ అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. వీరందరికి సోమవారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో ఐరా సంస్థ సభ్యులు బహుమతులు ప్రధానం చేసినట్లు తెలిపారు. బహుమతులు పొందిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ మాధవి, అబాకస్ టీచర్ హేమలత, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి చేయూతనందించిన చేనేత ప్రముఖుడు...!

**ధర్మవరం, ఫిబ్రవరి25,ప్రభాతవార్త**



పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న తారక్ ట్రస్టుసభ్యులు

ధర్మవరంలోని నాగులబావి వీధికిచెందిన నిరుపేద కుటుంబానికి చేనేత ప్రముఖుడు, టీడీపీ నాయకుడు సంధారాఘవ చేయూతనందించారు. 15 రోజుల క్రితం సాకే శ్రీరాములు గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో శ్రీరాములు కుటుంబం తీవ్ర దుర్భర పరిస్థితిలో ఉన్న విషయాన్ని తారక్ ట్రస్టు గమనించి సంధారాఘవ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.7వేలు నగదు, నిత్యావసర సరుకులను ఏర్పాటుచేశారు. దీంతో తారక్ ట్రస్టు సభ్యులు వీటిని సాకేశ్రీరాములు బార్యకల్యాణి,కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. దీంతో మృతుని కుటుంబసభ్యులు సంధారాఘవకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## 6న సంతాన సాఫల్య అవగాహన శిబిరం

**అమరాపురం ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**



డాక్టర్ గుండేగౌడ్

మండల కేంద్రంలో గుండె గౌడ హాస్పిటల్ నందు మార్చి 6వ తేదీన సంతాన సాఫల్య అవగాహనశిబిరంను ఏర్పాటు చేసినట్లు డాక్టర్ గుండె గౌడ్ తెలిపారు. బెంగళూరులోని బసవేశ్వర నగర్ కు చెందిన సీనియర్ పెర్టిలిటీ నిపుణులు, క్లినికల్ డైరెక్టర్ నోవా ఐవియఫ్ డాక్టర్ అవివా పింటో రోడ్రిగ్స్ పాల్గొంటారని ఆయన తెలిపారు. సంతానం లేని వారు ఈ కార్యక్రమంలో పాల్గొని డాక్టర్ యొక్క సూచనలు సలహాలు మరియు ప్రత్యుమ్నయ చికిత్సపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## లంక దినకర్‌ను కలిసిన జిఎం శేఖర్



చైర్మన్‌ను కలిసిన బిజెపి జిల్లా అధ్యక్షులు, తదితరులు

**గోరంట్ల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

విజయవాడలో రాష్ట్ర 20 సూత్రాల చైర్మన్ లంక దినకర్‌ను అమరావతిలోని ఆయన కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా భారతీయ జనతాపార్టీ అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారితో చర్చించారు. అదేవిధంగా వారికి అధ్యక్షులు జిఎం శేఖర్, వేణుగోపాలరావు, అయోధ్యబాల రాముని విగ్రహాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పరిగి వేణుగోపాల్‌స్వామి, మేదర శ్రీనివాసులు, బోయ లక్ష్మినారాయణ, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో..

# వెస్టిండీస్ ఘన విజయం

### ఏడు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చిత్తు

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్-2025 టోర్నీలో వెస్టిండీస్ మాస్టర్స్ జట్టు శుభారంభం చేసింది. ముంబై వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్లఓ వెస్టిండీస్ 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా కెప్టెన్ షేన్ వాట్సన్ విధ్వంసకర శతకంతో చెలరేగాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన వాట్సన్ ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కేశాడు. కేవలం 52 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్సలతో 107 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. అతడితో పాటు డానియల్ క్రిస్టియన్ (32), కట్టింగ్ (18) పరుగులతో రాణించారు. విండీస్ బౌలర్లలో యాష్లేనర్స్ 3 వికెట్లు పడగొట్టగా, జెర్మీ టేలర్, రామ్పాల్ తలా 2 వికెట్లు సాధించారు. అనంతరం 217 బంతుల్లో విండీస్ కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 19.2 ఓవర్లలో చేధించింది. విండీస్ ప్లేయర్ లెండిల్ సిమన్స్ తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. భారీ లక్ష్య చేధనలో సిమన్స్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 44 బంతుల్లో 6 ఫోర్లు,8 సిక్సర్లతో 94 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. అతడితో పాటు, డ్వేన్ స్మిత్ (51) హాఫ్ సెంచరీతో రాణించాడు. చాడ్విక్ వాల్టన్ (11 బంతుల్లో 4 ఫోర్లతో 23) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆసిస్ బౌలర్లలో బెన్ హిల్ఫెన్‌హాస్, క్రిస్టియన్ తలా వికెట్ సాధించారు. కాగా భారత్ ఇప్పటికే తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై విజయం సాధించింది.



## హాకీ ప్రో లీగ్‌లో భారత్ మహిళ, పురుష జట్ల ఓటమి

**న్యూఢిల్లీ:** ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ఓటమి ఎదురైంది. ఈ హాకీ టోర్నీలో భారత్ మహిళలు, పురుషుల జట్లు రెండూ పరాజయాలను చవిచూశారు. ఈ టోర్నమెంట్‌లో భారత అమ్మాయిల హాకీ జట్టు వైఫల్యాల పరంపర కొనసాగుతోంది. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-4తో నెదర్లాండ్స్ చేతిలో పరాభవం పాలైంది. ఉదిత (18 నిముషంలో, 42 నిముషం)లో రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచింది. ఈ టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌లలో భారత్ అమ్మాయిలకు ఇది నాలుగో పరాజయం. ఇక అబ్బాయిల పోరులో ఇంగ్లండ్ 32తో భారత్‌ను ఓడించింది. 18వ నిమిషంలో అభిషేక్, 39వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ తలా ఓ గోల్ చేశారు. ఇంగ్లండ్ తరఫున జాకబ్ పేటన్ (15వ నిముషంలో) తొలి గోల్ చేయగా సామ్ వర్డ్ (19వ నిముషంలో, 29వ నిముషంలో) రెండు గోల్స్ చేశాడు.

# పాకిస్థాన్‌కు బిగ్ షాక్

### 'ఛాంపియన్స్' నుండి ఔట్

### జట్టు, కోచింగ్ స్టాఫ్‌పై పిసిబి సీరియస్

### క్రికెట్ టీంలో ఊహించని మార్పు?

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో ఆతిథ్య పాకిస్తాన్ గ్రూప్ దశలోనే తీవ్ర పరాభవాన్ని ఎదుర్కొని టోర్నీ నుండి వైదొలగాల్సి వచ్చింది. 29 సంవత్సరాల తర్వాత ఐసీసీ టోర్నమెంట్‌ను నిర్వహించే అవకాశం ఆ దేశానికి లభించింది. అయితే, 5 రోజుల్లోనే టోర్నమెంట్ నుంచి నిష్క్రమించినట్లైంది. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై ఓటమి చెందిన పాక్, తదుపరి రెండో మ్యాచ్‌లోనూ భారత్ చేతిలోనూ మరింత ఘోరమైన పరాజయాన్ని



మూటగట్టుకుంది. సెమీఫైనల్స్ రేసులో నిలవాలంటే పాకిస్థాన్ బంగ్లాదేశ్‌పై విజయం సాధించాల్సిన అవసరం ఉంది. కానీ, న్యూజిలాండ్ విజయం వారి ఆశలను దెబ్బతీసింది. భారీ ఆశలతో ఈ టోర్నమెంట్‌లోకి వచ్చిన పాకిస్తాన్ జట్టుకు ఇది పెద్ద దెబ్బ. న్యూజిలాండ్ చేతిలో బంగ్లాదేశ్ ఓడిపోయిన నేపథ్యంలో సెమీస్‌కు మినుకుమినుకు మంటూ ఉన్న మరో చివరి అవకాశం కూడా పాకిస్తాన్‌కు మూసికుపోయింది. దీంతో గత్యంతరం లేక పాక్ ఛాంపియన్స్ ట్రోఫీ నుండి ఆదిలోనే నిష్క్రమించింది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌లో చాలా తీవ్రమైన ప్రతిచర్య కనిపిస్తోంది. మాజీ క్రికెటర్ల నుంచి అభిమానుల వరకు అందరూ పాకిస్తాన్ జట్టు తీరును తప్పు పడుతున్నారు. ఇది కాకుండా, కోచింగ్ సిబ్బందిపై కూడా అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా జట్టులో ఒకే ఒక స్పిన్నర్‌ను తీసుకున్నాడనే ప్రధాన కోచ్ ఆకిబ్ జావేద్ నిర్ణయాలపై సైతం ముఖ్యంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) సీరియస్ అయింది. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత పాకిస్తాన్ జట్టుతో పాటు, కోచింగ్ సిబ్బందిలో మార్పు చేయాలని భావిస్తోంది. పాక్ జట్టు మొత్తం కోచింగ్ సపోర్ట్ స్టాఫ్‌ను తొలగించాలని పిసిబి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలుపు, ఎరుపు బంతి ఫార్మాట్లకు ప్రత్యేక కోచ్‌లు ఉంటారా లేదా అనేది బోర్డు ఇంకా నిర్ణయించలేదు. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీలో పేలవమైన ప్రదర్శన తర్వాత సహాయక సిబ్బందిని పూర్తిగా మార్చనుంది. అయితే, గత సంవత్సరం నుంచి కోచ్‌లు, సెలెక్టర్లను మార్చిన విధానాన్ని పరిశీలిస్తే, ఈ స్థానాలకు ఇతర అభ్యర్థులను కనుగొనడం చాలా కష్టం అవుతుంది. గత కొంత కాలంగా పాకిస్తాన్ జట్టులో చాలా మార్పులు జరిగాయి. గ్యారీ కిర్‌స్టెన్, జాసన్ గిల్లెస్పీ కొంతకాలం కోచ్‌లుగా ఉన్నారు. గ్యారీ కిర్‌స్టన్ అకస్మాత్తుగా రాజీనామా చేశాడు. జాసన్ గిల్లెస్పీ శిక్షణలో జట్టు బాగా రాణించింది. కానీ, అతను కూడా జట్టు నుంచి తొలగించాడు. ఇది కాకుండా, జట్టు కెప్టెన్సీలో చాలా మార్పులు జరిగాయి. దీని కారణంగా పాకిస్తాన్ జట్టు ఎప్పటికీ స్థిరపడలేకపోయింది. కాగా పాకిస్తాన్ తో పాటు, బంగ్లాదేశ్ జట్టు కూడా సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ రెండు జట్లు ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. పాకిస్తాన్ తన తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓటమి పాలైంది. కాగా, రెండవ మ్యాచ్‌లో భారత జట్టు చేతిలో ఓడిపోయింది. మరోవైపు, న్యూజిలాండ్ కంటే ముందు బంగ్లాదేశ్ భారత జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కూడా ఓడిపోయింది. ఇప్పుడు ఈ రెండు జట్లు గ్రూప్ దశలో తమ చివరి మ్యాచ్‌ను ఒకదానితో ఒకటి ఆడతాయి. ఇది పాయింట్ల పట్టికపై ఎటువంటి ప్రభావం చూపదు.



## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..

# యుపి అద్భుతం

### సూపర్ ఓవర్లో థ్రిల్లింగ్ విక్టరీ.. అయినా అగ్రస్థానంలో బెంగళూరు

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)-2025లో ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుపై యూపీ వారియర్స్ అద్భుత విజయం సాధించింది. అయినప్పటి పాయింట్ల పట్టికలో ఇప్పటికీ బెంగుళూరు నెంబర్ వన్ పొజిషన్‌లో ఉంది. డబ్ల్యూపీఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో మాత్రం రాయల్ చాలెంజర్స్ నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఆ జట్టు 2 మ్యాచ్‌ల్లో గెలిచి, రెండింటిలో ఓడింది. అలాగే రెండోస్థానంలో 3 పాయింట్లతో ముంబై ఇండియన్స్ ఉంది. ఈ విజయంతో యూపీ పట్టికలో 3వ స్థానానికి వెళ్లింది. ఇక ఈ మ్యాచ్‌లో సూపర్ ఓవర్లో యూపీ విజయం సాధించింది. సూపర్ ఓవర్లో తొమ్మిది పరుగుల టార్గెను నిర్దేశించగా, 6 బంతులు ఆడిన బెంగుళూరు కేవలం 4 పరుగులే చేసింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగుళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 180 పరుగులు చేసింది. ఎలీస్ పెర్రీ విధ్వంసక ఫిఫ్టీ (56 బంతుల్లో 90 నాటౌట్)తో సత్తా చాటింది. అనంతరం ఛేదనలో ఓవర్లన్నీ ఆడిన యూపీ సరిగ్గా 180 పరుగులకు ఆలౌటైంది. సోఫీ ఎకిల్ స్టోన్ (19 బంతుల్లో 33) అద్భుతమైన పోరాటంతో మ్యాచ్ టై అయింది. దీంతో సూపర్ ఓవర్లో యూపీ తొలుత 8 పరుగులు చేయగా, ఆర్సీబీ దాన్ని ఛేదించడంలో విఫలమైంది. ఇక టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకిశుభారంభం దక్కలేదు. కెప్టెన్ స్మృతి మంధన(6) మరోసారి విఫలమైంది. మరో ఓపెనర్ డానీ వ్యాట్ హోడ్జ్ (57)తో కలిసి స్కోరును పెర్రీ ముందుకు నడిపించింది. వీరిద్దరూ యూపీ బౌలర్లను చితక్కొట్టి 65 బంతుల్లోనే 94 పరుగులు జోడించారు. అయితే కాసేపటికే వ్యాట్ ఔటవగా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. దీంతో ఒంటరి పోరాటం చేసిన పెర్రీ జట్టుకు భారీ స్కోరు అందించింది. బౌలర్లలో చినెల్ హెన్రీ, కెప్టెన్ దీప్తి శర్మ, తాహ్లియా మెక్ గ్రాత్ కు తలో వికెట్ దక్కింది. కాగా ఛేదనను ఓ మోస్తారుగా యూపీ ఆరంభించింది. కిరణ్ నవగిరే (24), దీప్తి (25), శ్వేతా షరవాత్ (31) భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. దీంతో ఓ దశలో 134-8తో యూపీకి ఓటమి తప్పదనిపించింది. ఈ దశలో ఎకిల్ స్టోన్ విజృంభించింది. చివరి రెండు ఓవర్లలో 29 పరుగులు కావాల్సి ఉండగా, 19వ ఓవర్లో 11 రన్స్ రాగా, 20వ ఓవర్లో 2 సిక్స్‌లు, ఒక ఫోర్ కొట్టిన ఎకిల్ ఆర్సీబీని బెంబేలెత్తించింది. అయితే చివరి బంతికి ఒక్క పరుగు అవసరమైన దశలో ఎకిల్ స్టోన్ రనౌట్ అయింది. దీంతో మ్యాచ్ టోర్నీలోనే తొలి సూపర్ ఓవర్ కు దారి తీసింది.

## బౌలింగ్ కోచ్‌గా శ్రీధరన్

### చెన్నై సూపర్ కింగ్స్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 సీజన్ మార్చి 22 నుండి ప్రారంభం కానుంది. దీంతో ఈ ఐపీఎల్ ప్రారంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ అసిస్టెంట్ బౌలింగ్ కోచ్‌ను మార్చింది. డ్వేన్ బ్రావో స్థానంలో 49 ఏళ్ల భారత మాజీ ఆల్ రౌండర్ శ్రీధరన్ శ్రీరామ్‌కు బాధ్యతలు అప్పగించింది. ఇంతకుముందు సీఎస్కేకి అసిస్టెంట్ బౌలింగ్ కోచ్గా పని చేసిన బ్రావో కోల్‌కత్తా నైట్ రైడర్స్ కు మెంటర్‌గా చేరాడు. శ్రీరామ్ నియామకాన్ని చెన్నై సూపర్ కింగ్స్ అధికారికంగా ప్రకటించింది. ఇక శ్రీధరన్ ఎడమచేతి స్పిన్ బౌలర్. అతను భారత్ తరఫున 8 వన్డే మ్యాచ్‌లు ఆడాడు. అందులో 81 పరుగులు చేసి 9 వికెట్లు పడగొట్టాడు. 2000లో అరంగేట్రం చేసిన శ్రీధరన్, 2004లో అతని చివరి వన్డే మ్యాచ్ ఆడాడు. శ్రీధరన్ చెన్నై సూపర్ కింగ్స్‌లో స్టీఫెన్ ఫ్లెమింగ్ (ప్రధాన కోచ్), మైక్ హస్సీ (బ్యాటింగ్ కోచ్), ఎరిక్ సైమన్స్ (బౌలింగ్ కన్సల్టెంట్)తో కలిసి పని చేస్తాడు. అతను గతంలో 2016-2022 వరకు ఆస్ట్రేలియాలో అసిస్టెంట్ కోచ్‌గా, తరువాత బంగ్లాదేశ్‌కు టీ20 కన్సల్టెంట్‌గా పనిచేశాడు. వన్డే ప్రపంచ కప్పు ముందు అతను టెక్నికల్ కన్సల్టెంట్‌గా కూడా పనిచేశాడు. ఐపీఎల్లో శ్రీధరన్ ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లతో అనుభవం ఉంది. కాగా 2024 ఐపీఎల్ సీజన్లో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కంటే ఐదవ స్థానంలో నిలిచింది. ఇర వచ్చే నెలలో ప్రారంభమయ్యే ఐపీఎల్ సీజన్లో చెన్నై సూపర్ కింగ్స్ తమ తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది.



# ఐదేళ్లలో రిలయన్స్ రూ.50వేల కోట్ల పెట్టుబడులు


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** అస్సాం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వచ్చే ఐదేళ్లలో రూ.50 కోట్ల పెట్టుబడిని ప్రకటించింది. 'అడ్వాంటేజ్ అస్సాం 2.0 ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్' సంద ర్భంగా ఆర్ఐఎల్ చైర్మన్ ముఖేష్ అంబానీ ఈ మేరకు ప్రకటన చేశారు. టెక్నాలజీ, మౌలిక సదుపాయాలు, రిటైల్ విస్తరణ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయ డానికి కంపెనీ ప్రతిష్టాత్మక ప్రణాళికలను వివరించారు.



2018లో జరిగిన సదస్సులో రాష్ట్రంలో రూ.5వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ హామీ ఇచ్చిందని, కానీ దానిని రూ.12వేల కోట్లకు పెంచామని అంబానీ గుర్తు చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం సహా వివిధ రంగాలకు ప్రయోజనం చేకూర్చేలా ఎఐను ఉపయోగించుకోవాలని ఈ సమ్మిట్ లక్ష్యంగా పెట్టుకుంది. ఎఐ డేటా సెంటర్: అస్సాంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-రెడీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆర్ఐఎల్ యోచిస్తోంది. కృత్రిమ మేధ సహాయంతో ఉపాధ్యాయులు, వైద్యులు, రైతులు అస్సాం నివాసితుల జీవన ప్రమాణా లను మెరుగుపరచాలని కంపెనీ ఆశిస్తున్నట్లు అంబానీ తెలిపారు. మెగా ఫుడ్ పార్క్: అస్సాంలో సమృద్ధిగా ఉన్న వ్యవ సాయ, ఉద్యాన ఉత్పత్తు లకు విలువను జోడించడా నికి మెగా ఫుడ్ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ చర్య రాష్ట్ర రైతులకు మద్దతు ఇస్తుంది. ఫుడ్ ప్రాసెసింగ్, పంపిణీకి కొత్త అవకాశాలను సృష్టించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను మెరుగవుతుంది. రిలయన్స్ రిటైల్ విస్తరణ: అస్సాంలో రిలయన్స్ రిటైల్ స్టోర్ల సంఖ్యను రెట్టింపుచేయాలని ఆర్ఐఎల్ యోచిస్తోంది. ఈ సంఖ్యను 400 నుంచి 800కు పెంచనుంది. ఈ విస్తరణ రిటైల్ ల్యాండ్ స్కేప్‌ను మెరుగుపరుస్తుంది. వినియోగదారులకు విస్తృత శ్రేణి ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు ఇది తోడ్ప డుతుంది. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ: అణు ఇంధనంతో సహా క్లీన్ అండ్‌గ్రీన్ ఎనర్జీకి అస్సాంను హబ్‌గా మార్చడంపై రిలయన్స్ దృష్టి సారించనుంది. అస్సాంలో రెండు కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లను ఆర్ఐఎల్ నిర్మించనుంది. ఇవి యేటా 8లక్షల టన్నుల క్లీన్ బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తాయి. ప్రతిరోజూ రెండు లక్షల ప్యాసింజర్ వాహనాలకు ఇంధనం అందించేందుకు సరిపోతుంది.

# స్టార్‌బక్స్‌లో వెయ్యికిపైగా ఉద్యోగులు ఇంటికే..

**ముంబై, ఫిబ్రవరి 25:** కాఫీ విషయానికి వస్తే స్టార్‌బక్స్ కాఫీ పేరు టక్కున నోట్లోకి వస్తుంది. అవును, ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా కాఫీ హౌస్ చైన్ నడిపిస్తుంది. అలాగే భారతదేశంలో టాటా గ్రూప్‌తో జాయింట్‌వెంచర్ ఉంది. ఇప్పుడు, ఈ పెద్ద కంపెనీ ఉద్యోగుల తొలగింపుల ప్రక్రియ చేపట్టింది. దింతో సుమారు 1100 మంది ఉద్యోగులకు ఇంటికి పంపించేందుకు ఒక లిస్ట్ రెడీ చేసింది. అయితే కంపెనీ పునర్నిర్మాణ ప్రణాళికలో భాగంగా స్టార్‌బక్స్ సీఈఓ ఈ తొలగింపును ప్రకటించారు. సేల్స్ తగ్గడంతోనే ఉద్యోగుల తొలగింపులు రాయిటర్స్ నివేదిక ప్రకారం, స్టార్‌బక్స్ కార్ప్ ఉద్యోగుల నుండి 1100 మంది ఉద్యోగులను తొలగించబోతోంది. చైర్మన్ అండ్ సిఇఒ బ్రియాన్ నికోల్ 2024 సెప్టెంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సేల్స్ తగ్గు ముఖం పట్టడంతో గత సంవత్సరం ఉద్యోగుల తొలగింపులను ప్రకటించారు. అయితే ఉద్యోగులకు జారీ చేసిన ఓ లేఖలో ఈ సమాచారాన్ని వెల్లడించామని, ఈ తొలగింపులకు గురైన ఉద్యోగులకు మంగళవారం మధ్యాహ్నం నాటికి సమాచారం అందిస్తామని కంపెనీ చెప్పినట్లు నివేదికలో పేర్కొంది. ఇప్పుడు 1100 మంది ఉద్యోగులను తొలగించడంతో పాటు కంపెనీలో ఖాళీగా ఉన్న వందలాది ఉద్యోగాలను కూడా తొలగిస్తామని ఆయన చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా స్టార్‌బక్స్‌లో దాదాపు 16,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా 80



దేశాలలో 36,000 కంటే ఎక్కువ స్టోర్స్ ఉన్నాయి. తొలగింపుల ప్రభావం ఉండదు. నివేదిక ప్రకారం, స్టార్‌బక్స్ సీఈఓ బ్రియాన్ నికోల్ తొలగింపులకు సంబంధించి విడుదల చేసిన తన లేఖలో మరింత సమర్థవంతంగా పనిచేయడం, అకౌంటబిలిటీ పెంచడం, సంక్లిష్టతను తగ్గించడం, మెరుగైన ఇంటిగ్రేషన్ ప్రోత్సహించడం మా ఉద్దేశ్యం అని స్పష్టం చేశారు. ఈ దృష్ట్యా వర్క్ ఫోర్స్ తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నారు, అయితే ఈ తొలగింపులు మేకింగ్ అండ్ వేర్ హౌస్ సంబంధిత సిబ్బందిని ప్రభావితం చేయదు. దీనితో పాటు, ఈ తొలగింపుల బాధిత ఉద్యోగులు మే 2, 2025 వరకు జీతం ఇంకా ఇతర బెనిఫిట్స్ పొందుతారు. భారతదేశంలో స్టార్‌బక్స్ భారతదేశంలో స్టార్‌బక్స్‌కి కూడా పెద్ద వ్యాపారాన్ని ఉంది.

# 52శాతానికి పెరిగిన 5జి నెట్‌వర్క్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** టెలికం దిగ్గజం రిలయన్స్ జియో నెట్‌వర్క్ విస్తరణను వేగవంతం చేయడంతో దేశంలో సొంత 5జి నెట్‌వర్క్ లభ్యత 52 శాతానికి చేరుకుందని ప్రముఖ నెట్‌వర్క్ టెస్టింగ్ సంస్థ ఓక్లా ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో అత్యధికంగా 80శాతం సొంత 5జి లభ్యతతో అగ్రస్థానంలో ఉన్న చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో నిలిచిందని ఓక్లా నివేదిక వెల్లడించింది. దీనర్థం 5జి డివైజ్‌లను వాడుతున్న దేశీయ వినియోగదారులు తన నెట్‌వర్క్ వినియోగం 52 శాతం 5జి నెట్‌వర్క్‌ను యాక్సెస్ పొందుతున్నారని నివేదిక వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో ముఖేష్ అంబానీ నేతృత్వం లోని జియో కంపెనీ మొత్తం 17 కోట్ల 5జి సబ్‌స్క్రైబర్లను కలిగి ఉంది. దేశవ్యాప్తంగా 5జి సేవలు లభిస్తున్న కారణంగా ఎక్కువమంది కస్టమర్లు 5జి స్మార్ట్‌ఫోన్‌లకు అప్‌గ్రేడ్ అవుతున్నారు. మరో ప్రైవేట్ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ కూడా 12 కోట్ల యూజర్లతో 5జి కనెక్టివిటీని అందిస్తోంది. రిలయన్స్ జియో అందించే 40శాతం వైర్‌లెస్ ట్రాఫిక్‌లో 5జి వాటా ఉందని, త్వరలో 4జి నెట్‌వర్క్‌ను అధిగమిస్తామని రిలయన్స్ ఇన్ఫోకామ్ ప్రెసిడెంట్ పేర్కొన్నారు.








Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 **Air Surcharge:** Delhi : 40 Ps.